Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 102 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 24 - 10 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## బంగారం అవకతవకల కేసు..శబరిమల ఆలయ మాజీ అధికారి అరెస్టు



**ఇంటర్నెట్ డెస్క్:** శబరిమల ఆలయంలో వెలుగు చూసిన బంగారం అవకతవకలపై దృష్టి సారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) బుధవారం ఆలయ మాజీ అధికారి మురారి బాబును అదుపులోకి తీసుకుంది. గురువారం ఆయన బంధువులకు ఈ విషయాన్ని అధికారికంగా తెలియజేసింది. మురారి బాబును కలుసుకునేందుకు కూడా వారిని అనుమతించింది. త్వరలో సిట్ మురారి బాబును మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి ఆయన కస్టడీ కోరనుంది. శబరిమల గర్భగుడి పక్కన ఉన్న ద్వారాపాలకులు, ఆలయ ద్వారా లపై ఏర్పాటు చేసిన బంగారు తాపడాలు బరువు తగ్గిన విషయం ప్రస్తుతం కేరళలో కలకలం రేపుతోంది. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందం రంగంలోకి దిగింది. ఇప్పటికే ఈ కేసులో ప్రధాని నిందితుడిగా ఉన్న ఉన్నికృష్ణన్‌ను సిట్ అరెస్టు చేసింది. బంగారు పూతతో ఉన్న ఆ రాగి తాపడాలకు మరమ్మతుల పనులను స్పాన్సర్ చేసేందుకు ఉన్నికృష్ణన్ 2019లో ముందుకొచ్చారు. వాటిని తొలగించే సమయంలో బరువు 42.8 కిలోలుగా ఉంది. తాపడాల మరమ్మతుల తరువాత తూచి చూడగా బరువు 38.28 కేజీలుగా తేలింది. దీంతో, ఈ అంశం వివాదాస్పదంగా మారింది. ఈ కేసుకు సంబంధించి అప్పట్లో విచారణ జరిపిన ట్రావెన్‌కోర్ దేవశ్వమ్ బోర్డు (టీడీబీ).. అవకతవకలు జరిగాయని తేల్చింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆలయ అధికారి మురారిని సస్పెండ్ చేసింది. ఈ క్రమంలో సిట్ అధికారులు బుధవారం మురారిని ఆయన నివాసంలోనే అరెస్టు చేసి తిరువనంతపురంలోని క్రైమ్ బ్రాంచ్ ఆఫీసుకు తరలించారు. అనంతరం అరెస్టు గురించి ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బంగారం లెక్కల అవకతవకలకు సంబంధించి రెండు కేసుల్లో మురారి బాబు నిందితుడిగా ఉన్నారు. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. బంగారు తాపడాల మరమ్మతులకు సంబంధించి తాను ప్రాథమిక నివేదిక మాత్రమే ఇచ్చానని చెప్పారు. తుది అనుమతులు ఉన్నతాధికారులు ఇచ్చారని అన్నారు. ఇక ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఉన్నికృష్ణన్ అక్టోబర్ 30 వరకూ సిట్ కస్టడీలో ఉంటారు.

## పెట్రో కెమికల్ రంగంలో ఏపీలో అపార అవకాశాలు

**- దక్షిణాసియాకు చేరువలో వ్యూహాత్మక ప్రాంతంగా ఏపీ - అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు - ఏపీలో పెట్టుబడులు పెట్టాలని టెక్ కంపెనీలకు ఆహ్వానం - రెండో రోజు పర్యటనలో అబుదాబి పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీ**






**అబుదాబి :** దక్షిణాసియాకు చేరువగా సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్...ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అత్యంత అనుకూలమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

ఈ రంగంలో పెట్టుబడులకు ఏపీలో విస్తృతంగా అవకాశాలు ఉన్నాయని అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులకు వివరించారు. యూఏఈ పర్యటనలో భాగంగా రెండో రోజు గురువారం అబుదాబీలో అల్ మైరాహ్ ఐలాండ్‌లోని ఏడీజీఎ స్క్వేర్‌లో ఏడీఎన్ఓసీ గ్లోబల్ ట్రేడింగ్ ప్రతినిధి అహ్మద్ బిన్ తలిత్‌తో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పెట్రోకెమికల్, ఇంధన, ఎల్ఎన్‌జీ, గ్యాస్ ప్రాసెసింగ్, పోర్ట్ లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అవకాశాలు గురించి చర్చించారు. కృష్ణపట్నం, మచిలీపట్నం, రామాయ పట్నం, కాకినాడ వంటి పోర్టుల సమీపంలో పెట్రో కెమికల్, ఎనర్జీ రంగాల పెట్టుబడులకు అనువుగా ఉంటాయని సీఎం అన్నారు. ఏడీఎన్ఓసీ – ఆంధ్రప్రదేశ్ మధ్య సాంకేతిక సహకారం పైనా స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని భేటీలో ఇరువురు నిర్ణయించారు.

## 1వ తేదీ నుంచి డి.డి.ఓ. కార్యాలయాలు ప్రారంభం : పవన్ కల్యాణ్

**- పంచాయతీల పాలన సంస్కరణల ఫలితాలు ప్రజలకు అందించాలి**
**- పంచాయతీరాజ్ అధికారులకు ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు**



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ పాలనాపరమైన సంస్కరణలు తీసుకువచ్చామని, వాటి ఫలాలు ప్రజలకు సక్రమంగా అందించే బాధ్యత ఉద్యోగులపై ఉందని రాష్ట్ర ఉప ముఖమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నవంబర్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రాంతీయ అభివృద్ధి అధికారులు (డి.డి.ఓ.) కార్యాలయాలు ప్రారంభించాలని ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం పంచాయతీరాజ్ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రివర్యులు సమావేశమయ్యారు. క్లస్టర్ విధానం రద్దు చేసి 13,351 గ్రామ పంచాయతీలను స్వతంత్ర యూనిట్లు చేయడం ద్వారా గ్రామీణులకు మెరుగైన సేవలు అందించే వెసులుబాటు తీసుకు వచ్చామని ఉప ముఖ్యమంత్రివర్యులు చెప్పారు. పల్లెల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పంచాయతీలు, గ్రామీణాభివృద్ధికి నిధులు సమకూరుస్తున్నామని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు పంచాయతీలు ఆర్థిక స్వయం ప్రతిపత్తి సాధించే విధంగా సరికొత్త ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నిధులు సమకూర్చడంలోను, పాలనాపరమైన సంస్కరణల్లోనూ కూటమి ప్రభుత్వం ఎంతో సానుకూల దృక్పథంతో ఉందనీ... ఆ ఫలితాలు ప్రజలకు చేర్చి పల్లెల అభివృద్ధిలో ఉద్యోగులు క్రియాశీలక బాధ్యత తీసుకోవాలన్నారు. నిధుల వినియోగం, పాలన సంస్కరణల అమలుపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. పల్లె పండగ 2.0 ద్వారా గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి ప్రణాళిక అందించాలని ఆదేశించారు.

## నీటిపారుదల నిర్మాణాల భద్రత కోసం అప్రమత్తంగా పనిచేయాలి : మంత్రి వంగలపూడి అనిత




**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, తుఫాన్ ప్రభావంపై హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత, జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయలక్ష్మి, జిల్లా కలెక్టర్లు మరియు రెవెన్యూ, ఇరిగేషన్ డిపార్ట్మెంట్స్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్. ప్రజలు ప్రాణాలు, ఆస్తులు, పంటలు మరియు నీటిపారుదల నిర్మాణాల భద్రత కోసం అప్రమత్తంగా పనిచేయాలి. రిజర్వాయర్స్, చెరువులు, బ్యారేజీలు, వాగులు అన్నింటిపై రౌండ్ ది క్లాక్ మానిటరింగ్ ఉండాలి. ప్రతి గంట ఇన్ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలు కంట్రోల్ రూమ్‌కి పంపాలి. జిల్లా కలెక్టరు, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఆర్ & బి మరియు పంచాయతీ శాఖలతో సమన్వయం చేసుకోవాలి. గేట్లు, స్లూయిసులు, స్పిల్ వేలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేసుకోవాలి. నీటి విడుదల చేయాల్సిన పరిస్థితి వస్తే క్రింది గ్రామాలకు సమాచారం ఇవ్వాలి. ఇసుక బస్తాలు, మోటర్లు, బోట్లు, జనరేటర్లు వంటి అత్యవసర సామాగ్రిని సిద్ధంగా ఉంచాలి. యంత్రాంగం నుండి ఫీల్డ్ వరకు నిరంతర సమాచారం అన్ని శాఖలు పంచుకోవాలి.

## మత్స్యకారులను క్షేమంగా తీసుకు వస్తాం : రామ్మోహన్ నాయుడు

**విజయనగరం, (రాజధాని వార్తలు):** బంగ్లాదేశ్ నేవీ సిబ్బందికి పట్టుబడిన ఎనిమిది మంది జిల్లా మత్స్యకారుల ఘటనపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు గురు వారం ప్రకటన విడుదల చేశారు. బాధిత కుటుంబాలకు పూర్తి భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన మత్స్య కారులను క్షేమంగా తీసుకు వస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే విదేశాంగ శాఖ మంత్రితో సంప్రదింపులు జరిపామని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ ఎంబసీతో నిరంతర సంప్రదింపులు, నిశిత పరిశీలన చేస్తున్నామని తెలిపారు. సముద్ర భద్రత, చట్టం, రక్షణ వ్యవహారాలు చూసే కోస్ట్ గార్డ్ వ్యవస్థతో ఈ సమస్యపై మాట్లాడామని రామ్మోహన్ నాయుడు లేఖలో వివరించారు. బంగ్లాదేశ్ కోస్టు గార్డుల చెరలో విజయనగరం జిల్లాకు చెందిన 8 మంది మత్స్యకారులు చిక్కుకున్నారు. పూసపాటిరేగ మండలం తిప్పలవలస, భోగాపురం మండలంలోని కొండ్రాజుపాలెం గ్రామాలకు చెందిన వీరు బ్రతుకుదెరువు కోసం వైజాగ్‌కు వలస వెళ్లారు.

సముద్రంలో చేపల వేట కొనసా గిస్తూ అక్కడే జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 13న విశాఖ చేపలరేవు నుంచి మరబోటుపై సముద్రంలోకి వేటకు వెళ్లారు. ఈ నెల 14న అర్ధరాత్రి 2 గంటల సమయంలో వారు దారి తప్పి బంగ్లాదేశ్ కోస్టు గార్డ్ పరిధిలోకి ప్రవేశించారు.

## మోదీ అందుకే కౌలాలంపూర్ వెళ్లడం లేదు : కాంగ్రెస్

**ఇంటర్నెట్ డెస్క్:** అక్టోబర్ 26 నుంచి 28 వరకు మలేసియాలో జరగనున్న ASEAN సమ్మిట్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా పాల్గొంటారు. ఇవాళ (గురువారం) మలేషియా ప్రధాన మంత్రి అన్వర్ ఇబ్రహీంతో ఫోన్‌లో మాట్లాడిన సందర్భంగా మోదీ ఈ విషయాన్ని తెలియజేశారు. ఆసియాన్–భారత్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి తాము ఎదురు చూస్తున్నామని మోదీ తన X ఖాతాలో పోస్ట్ చేశారు. కాగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆసియాన్ భాగస్వామి దేశాల నాయకులను సమావేశాలకు హాజరు కావాలని మలేషియా ఆహ్వానించింది. ఇందుకోసం ట్రంప్ అక్టోబర్ 26న రెండు రోజుల పర్యటన కోసం కౌలాలంపూర్‌కు వెళ్లనున్నారు. ఇదిలా ఉండగా, ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేతిలో చిక్కుకోవడం ప్రధాని మోదీకి ఇష్టం లేకపోవడం వల్లే, కౌలాలంపూర్ వెళ్లడం లేదని విమర్శిస్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'చాలా రోజులుగా ఈ సదస్సుకు మోదీ వెళ్తారా.. లేదా? అనే దాని గురించి ఊహాగానాలు ఉన్నాయి. ఇప్పుడు వెళ్లడం లేదని తేలిపోయింది. అంటే, ప్రపంచ నాయకులను ఆలింగనం చేసుకొని ఫొటో తీసుకోవడంతో పాటు, తనని తాను విశ్వగురువుగా చాటుకొనే అవకాశాన్ని మోదీ కోల్పోయారు. మోదీ ఈ సదస్సుకు వెళ్లకపోవడానికి కారణం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా అక్కడ ఉండటమే. కొన్ని వారాల క్రితం ఈజిప్టులో జరిగిన గాజా శాంతి సమావేశానికి కూడా మన ప్రధాని హాజరుకాలేదు' అంటూ జైరాం విమర్శలు గుప్పించారు.



**యన్ ఆర్ టి టవర్స్‌కు (33 అంతస్తులు, వాణిజ్య, నివాస) ప్రభుత్వం కేటాయించిన స్థలం రాజధాని అమరావతిలో రాయపూడి గ్రామం సీడ్ ఆక్సిస్ రోడ్డుకు ఉత్తరం వైపు ప్రాంతం.**
**ఫోటో సేకరణ - యస్ ఆర్ ఆర్**



యం ఏ యు డి ఉద్యోగుల కార్యాలయ భవనాలకు ప్రభుత్వం కేటాయించిన స్థలం సీడ్ యాక్సిస్ రోడ్ - లింగాయపాలెం జంక్షన్ ప్రాంతం రాజధాని అమరావతిలో నిర్మాణం జరుగుతోంది.
**ఫోటో సేకరణ - యస్ ఆర్ ఆర్**

# రాష్ట్రంలో అనుకూల వాతవరణం ఉన్నందు వల్లే పెట్టుబడులు వస్తున్నాయి

## - డబుల్ ఇంజన్ సర్కార్ పాలన ఫలితంగా పెట్టుబడిదారులు రాష్ట్రం వైపు చూస్తున్నారు - 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీకి ఊతం ఇచ్చేలా పెట్టుబడుల ఆకర్షణ - 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మెన్ లంకా దినకర్

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో అనుకూల వాతవరణం ఉన్నందువల్లే పెట్టుబడులు భారీ స్థాయిలో వస్తున్నాయని 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మెన్ లంకా దినకర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సూపర్ ఫాస్ట్ సర్కార్ పాలన ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు రాష్ట్రం వైపు చూస్తున్నారని, కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ఊతం ఇచ్చేలా పెట్టుబడుల ఆకర్షణ నేడు జరుగుతున్నదని ఆయన తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయంలోని తన చాంబరులో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ 2019 ముందే అదానీ డాటా సెంటర్ అంకురార్పణ జరిగినదని, అయితే 2019 - 24 మధ్య ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం 888.13 మిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను మాత్రమే సాధించడం జరిగిందని, అయితే, నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో ఒక్క గూగుల్ డాటా సెంటర్ నుండి 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి సాధించడం జరిగిందన్నారు. 2024 - 25 సంవత్సరానికి అన్ని రకాల పెట్టుబడులు 4.47 లక్షల కోట్ల రూపాయలు వచ్చినా, అందులో విదేశీ పెట్టుబడులు 233.14 మిలియన్ డాలర్లు మాత్రమే ఉండడానికి గత ప్రభుత్వ పెట్టుబడుల ప్రతికూల వాతావరణమే కారణమన్నారు. 2024 అనంతరం ఒక వైపు కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ జీ నేతృత్వంలోని ప్రభుత్వం సమయోచిత సహాయం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత,



ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమన్వయం మరియు పెట్టుబడుల కోసం ఐటీ శాఖ మంత్రి లోకేష్ నిరంతర కసరత్తు కలిసి నేడు ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అతి పెద్ద విదేశీ పెట్టుబడుల గమ్యస్థానంగా అవతరించిందన్నారు. నేడు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక తో ముందుకు దూసుకెళుతున్నాయన్నారు. విశాఖ కేంద్రంగా ఉత్తరాంధ్ర రాష్ట్ర ఆర్థిక రాజధానిగా దేశీయ మరియు విదేశీ పెట్టుబడుల ఆకర్షణ, రాయలసీమలో కోపర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్లు, డ్రోన్ పార్క్ వంటి వస్తు తయారీ పరిశ్రమల హబ్‌గా మరియు హార్టికల్చర్ జోన్‌గా అభివృద్ధి మరియు మధ్య ఆంధ్రలో రాజధాని అమరావతి నిర్మాణం, క్వాంటం వ్యాలీ ఏర్పాటు, రామాయపట్నం మరియు మచిలీపట్నం పోర్ట్ నిర్మాణం మరియు బీపీసీఎల్, ఇండోసోల్ వంటి పరిశ్రమలు ఏర్పాటుతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ జీ సహాయ సహకారాలతో దూసుకెళ్తుందన్నారు. రాష్ట్రంలో 18 నెలల కూటమి ప్రభుత్వం 11 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడం డబుల్ ఇంజిన్ సర్కార్ సాధించిన విజయం అన్నారు. 2047 నాటికి సగటున 15% వృద్ధితో 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా స్వర్ణ ఆంధ్రప్రదేశ్ అవతరించే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోడీ జీ సంకల్పం వికసిత్ భారత్‌లో కీలక భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారన్నారు. వైజాగ్ నుండి 1 ట్రిలియన్ డాలర్ల జీఎస్డిపి లక్ష్యం అని మంత్రి లోకేష్ అన్నారు, ఆ సంకల్పం సాధ్యమేనన్నారు. ఐటీ మరియు ఐటీ ఆధారిత రంగం, ఫార్మా, హైడ్రో పవర్ వంటి గ్రీన్ ఎనర్జీ, మిట్టల్ వంటి కొత్త ఉక్కు పరిశ్రమలు, ఎగుమతులు మరియు దిగుమతుల కోసం నౌకాయానం, భోగాపురం విమానాశ్రయం మరియు పుష్కలంగా ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించే పర్యాటక రంగం వంటి అన్నిరకాల హంగులు వైజాగ్ సొంతం కారణంగా వారి సంకల్పం సాధ్యమవుతుందన్నారు. 2047 నాటికి స్వర్ణ ఆంధ్రప్రదేశ్‌లో "వికసిత్ విశాఖ" లక్ష్యంతో కార్యాచరణకు 15 బిలియన్ డాలర్ల గూగుల్ పెట్టుబడులు ఒక మంచి ప్రారంభం అన్నారు. 2018 - 2019 లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణలో మన రాష్ట్రం 5 వ స్థానంలో ఉంటే, గత ప్రభుత్వ రివర్స్ పాలనతో 14 వ స్థానంకి చేరుకుందన్నారు. రాబోయే ఒక సంవత్సరంలో మరల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణలో ఏపీని అగ్రస్థానంలో నిలపడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అన్నారు. గత ప్రభుత్వ పాలనలో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లతో, కియా మోటార్స్ వంటి సంస్థలను గత ప్రజా ప్రతినిధుల బెదిరింపులతో, అమరావతి పైన కుట్రలతో దేశీయ మరియు విదేశీయ పెట్టుబడి దారులు రాష్ట్రం వైపు చూడాలంటే బెంబేలెత్తారన్నారు. గత పాలనలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ అదమ స్థానంలో నిలిచిందన్నారు.

వైజాగ్‌లో జరగబోయే పారిశ్రామిక సదస్సులో గూగుల్, మిట్టల్ స్టీల్, హైడ్రో పవర్ వంటి ప్రాజెక్టుల పెట్టుబడుల ఆకర్షణ ఒప్పందాలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేసి చూపుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ జీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సమన్వయ సహాయ సహకారాలతో రాష్ట్రంలో ఒక వైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో, మరోవైపు పెట్టుబడుల ఆకర్షణ కోసం పట్టుదలతో ముందుకు సాగుతున్న విద్య మరియు ఐటీ శాఖ మంత్రి లోకేష్‌కి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జోడీ స్వర్ణ ఆంధ్రప్రదేశ్‌ను వికసిత్ భారత్ లో భాగస్వామ్యం చేసేందుకు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు.

# భారత ఆర్థిక బలాన్ని ప్రతిబింబించి రికార్డు స్థాయి దీపావళి అమ్మకాలు

## - బిజెపి రాష్ట్ర నాయకురాలు కందికట్ల రాజేశ్వరి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఈ ఏడాది దేశవ్యాప్తంగా దీపావళి సందర్భంగా జరిగిన వ్యాపారాలు భారత ఆర్థిక వ్యవస్థ బలాన్ని మరియు ప్రజల్లో పెరుగుతున్న స్వదేశీ చైతన్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకులు కందికట్ల రాజేశ్వరి అన్నారు. CAIT (Confederation of All India Traders) నివేదిక ప్రకారం, ఈ దీపావళి సందర్భంగా దేశవ్యాప్తంగా 6.05 లక్షల కోట్ల విలువైన వ్యాపార లావాదేవీ లు జరిగినట్లు తెలిపారు. అందులో 5.40 లక్షల కోట్లు వస్తువుల విక్రయాల రూపంలో, 65,000 కోట్లు సేవల రూపంలో నమోదయ్యాయని పేర్కొన్నారు. రాజేశ్వరి మాట్లాడుతూ, "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'వోకల్ ఫర్ లోకల్' పిలుపు, 'స్వదేశీ ఆందోళన' ఆవేశం, అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ సరళీకరణ విధానాలు ఈ విప్లవాత్మక మార్పుకు కారణమయ్యాయి. భారత ప్రజలు ఇప్పుడు విదేశీ వస్తువులపై ఆధారపడకుండా, దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్నారు. ఇది దేశ ఆర్థిక స్వావలంబన దిశగా ఒక పెద్ద అడుగు," అని అన్నారు. ఆమె మరింతగా పేర్కొంటూ, "ఈ దీపావళి అమ్మకాలు భారత ఆర్థిక వ్యవస్థ పునరుత్థానానికి నిదర్శనం. ఇది మేక్ ఇన్ ఇండియా ఉద్యమానికి ప్రజల మద్దతును స్పష్టంగా చూపుతోంది" అని అన్నారు.


# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** అల్పపీడన ప్రభావంతో నెల్లూరు జిల్లా వ్యాప్తంగా భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. వర్షాల కారణంగా ప్రాణ నష్టం, పశు నష్టం జరగకుండా జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అనుకోని అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ముందు జాగ్రత్తగా అనువైన ఆశ్రయ కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రజలు జిల్లా కలెక్టరేట్‌లో అధికారులు 0861 2331261, 7995576699 నెంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారని, ప్రజలకు అవాంఛనీయ సంఘట నలు ఎదురైతే పైన తెలిపిన కంట్రోల్ రూమ్ నంబరుకు ఫోన్ చేయాలన్నారు. ప్రజల భద్రతకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. అన్ని శాఖల అధికారులు ప్రధానంగా మున్సిపల్, వైద్య, ఆరోగ్యం, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, విపత్తు నిర్వహణ తదితర శాఖల అధికారులు ప్రజలు అందుబాటులో ఉంటారన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రదేశాలకు తరలి వెళ్లాలని, వాగులు, వంకలు, నదులు ఉధృతంగా ప్రవహించే టప్పుడు వాటి సమీపంలో ఉండొద్దని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, గోడలకు దూరంగా ఉంటూ ప్రజలు సురక్షిత ప్రాంతంలో ఉండాలని, ప్రజల భద్రతకు ప్రభుత్వ అధికారులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. తడిచిన విద్యుత్ స్తంభాలు, ఇనుప స్తంభాలు, గోడలను ముట్టుకోవద్దని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో నిత్యం అందుబాటులో ఉంటారని, ఎలాంటి సమస్య ఉన్నా వారిని సంప్రదించాలని పేర్కొన్నారు. కూటమి నాయకులు కార్యకర్తలు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ తగిన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. తీరప్రాంత మత్స్యకారులు సముద్ర వేటకు వెళ్ళొద్దని, వర్షాలు తగ్గేంత వరకు సురక్షితంగా ఉండాలని సూచించారు.



# గజిబిజి గందరగోళం లేని గోలి మధు కవిత్వం - 'ఎదురీత' పుస్తకంపై సమీక్ష

తెలుగు సాహితీ ప్రపంచంలోకి పదునైన కలంతో, ఆధునిక భావాలతో, అభ్యుదయ కవిత్వంతో దూకుడుగా దూసుకు వచ్చారు గోలి మధు. ఏ సమస్య చెప్పినా క్షణంలో ఆ సమస్యపై సాధారణ పదాలతో, అందరికీ అర్థమయ్యే రీతిలో అద్భుతమైన కవిత రాయగల దిట్ట మధు. స్పష్టమైన దృక్పథంతో ఆయన కవితలు రాస్తారు. ప్రగతిశీల కవిత్వం రాస్తూ తెలుగు సాహిత్యంలో మధు అభ్యుదయ కవిగా మంచి పేరు సాధించారు. మధు ఓ చైతన్యం, ఓ మెరుపు, ఓ ఎరుపు. ఇంతకు ముందు మధు భారతీయ ధర్మ విశ్లేషణ, నవశకం, రైతు సమరభేరి, గమనం, సంఘర్షణ అనే అయిదు కవితా సంపుటిలను అందించారు. మధు ఆరవ కవితా సంపుటి 'ఎదురీత'ను ఈ నెల(అక్టోబరు) 12న మంగళగిరి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆంధ్ర నాటక కళా సమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు ఆవిష్కరించారు. మధు కవిత్వం నచ్చి, ముచ్చటపడి ఈ సంపుటి ముద్రణా దాతగా నన్నపనేని నాగేశ్వరరావు ముందుకు వచ్చారు. మధు చేసేది ప్రభుత్వ ఉద్యోగం అయినా, ప్రభుత్వాలపై తిరుగుబాటు కవిత్వం రాయగల ధైర్యవంతుడు. ప్రభుత్వాలే కాదు, సమాజంలోని రుగ్మతలన్నిటిపై సూటిగా, ఎంతో అందంగా కవితలు రాస్తారు. మనిషిగా ఎంత ఒదిగి ఉన్నా, కవిగా మాత్రం దేనికీ నెరవరు, తగ్గరు. తలెత్తుకుని మరీ కవిత్వం రాస్తారు. తన కవిత్వం మొత్తం ప్రతిబింబించే విధంగా ఈ సంకలనానికి 'ఎదురీత' అని అర్థవంతమైన శీర్షిక పెట్టారు. ఆయన ధోరణి ఈ కవితా సంకలనంలో స్పష్టంగా అర్థమవుతుంది. సమాజం పట్ల, తను రాయవలసిన కవిత్వం పట్ల స్పష్టమైన అవగాహన ఉన్న కవి. ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమానికి బాసటగా 'రైతు సమరభేరి' కవితా సంపుటి తీసుకువచ్చారు. మధు కవిత్వం ఎంత మక్కువతో రాస్తారో, ఉద్యోగం కూడా అంతే నిజాయితీ, నిబద్ధత, అంకితభావంతో చేస్తారు. ఈ కవితా సంపుటిలోని 55 కవితలలో వివిధ విభిన్న పార్శ్వాలను స్పృశించారు. ఇందులోని ప్రతి కవితలో భాష, భావం, శబ్దం, ప్రేమ, ఆత్మీయత, సామాజిక స్పృహ, ఆవేశం, ఉద్రేకంతో కూడిన ఓ కొత్తదనాన్ని పాఠకులకు అందించాలనే తపన ఆయనలో కనిపించింది. ఈ కవితలను చదవడం మొదలుపెడితే, చివరి వరకు పుస్తకం మూయలేరు.




పాఠకులను అంతగా కట్టిపడేశాలా ఈ కవితలు ఉన్నాయి. సమాజం పట్ల, కవిత్వం పట్ల ఆయనకు ఉన్న అంకిత భావం స్పష్టంగా తెలుస్తోంది. ప్రజల పక్షం, బాధితుల పక్షం నిలిచిన కవి గోలి మధు. సజావుగా సాగే జీవితం తలక్రిందులైతే, కాలానికి ఎదురీది, తనని, తన చెల్లిని పెంచిన తీరు ద్వారా అమ్మ గోలి పార్వతీ దేవే తన ఎదురీతకు స్ఫూర్తి అని చెప్పడంలోనే మధు సంస్కారం తెలుస్తోంది. మంగళగిరి లయన్స్ క్లబ్ అధ్యక్షు రాలిగా ప్రజాసేవలో ప్రపంచ రికార్డు నెలకొల్పిన దివంగత నన్నపనేని లక్ష్మికి ఈ పుస్తకం అంకితం ఇవ్వడం ద్వారా ఆయన మహిళలకు ఇచ్చే గౌరవం అర్థమవుతోంది. గుడి కప్పులు ధగ ధగ మెరుస్తుంటే - బడి కప్పులు పెచ్చులూడి పడుతున్నాయి... గుళ్ల మీద చూపించిన శ్రద్ధ మనం బడులమీద చూపించడంలేదన్న బాధ వ్యక్తం చేశారు మధు. ఈ కవిత చదువుతుంటే ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ, నటి, నిర్మాత మంచు లక్ష్మి గుర్తుకు వస్తారు. "కట్టాల్సింది దేవాలయాలు, చర్చిలు, మసీదులు కాదు... విద్యాలయాలు, వైద్యశాలలు" అని రామ్ గోపాల్ వర్మ అన్నారు. మంచు లక్ష్మి తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పరిధిలో పది, పది ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకున్నారు. అత్యధిక మంది దాతలు అలా ముందుకు వచ్చి బడులను బాగుచేయాలన్నదే మధు కోరిక. తమ పెంపుడు కుక్క 'మిలో' మరణించినప్పుడు మధు రాసిన 8 పేజీల కవిత పాఠకుల కంట తడిపెట్టిస్తోంది.

పెంపుడు కుక్కలతో ఆ ఇంటి వారి అనుబంధం, వాటి చేష్టలు, అల్లరి, అరుపులు, చూపులు, ప్రేమ, వాటి ప్రవర్తనా తీరు..., వాటిపై ఇంట్లో వారు చూపించే ప్రేమ, అవి మరణించినప్పుడు వారు పడే బాధ... చాలా అద్భుతంగా రాశారు. దానిని అందరూ చదివి తీరవలసిందే. ముఖ్యంగా జంతు ప్రేమికులకు, కుక్కలను పెంచు కునేవారి మనసుకు హత్తుకునే విధంగా ఉంటుంది. మనిషి మనిషికీ మతం మత్తు-సందు సందుకీ కులం కిక్కు, తడి గుడ్డతో గొంతులు తెగుతుంటాయి-తడి గుడ్డ వేసుకుని వేడుక చూస్తు న్నంత కాలం, పీడితుల నడుమ ఐక్యత సాధించనంతవరకూ పీడకునిదే గెలుపు, ఒకటికి మరొకటి జత చేరనిదే ఒకటి లేనేలేదు - పరుగు పందెంలో ఒకటో స్థానానికి రెండు కాళ్లు, పోరుబాట చతికిల పడితే- సగటు మనిషి 'చితి'కే, మణిపూర్‌లో తెగుతున్న తలకు- తెగల నడుమ వైరపు అబద్ధం ఆభరణం, ఆర్థిక దాహానికి అధికారం తోడై పైశాచిక విహారం, మారే జెం డాలు మార్చే ఎజెండాలు - వాళ్లిద్దరే ప్రతిసారీ, ప్రశ్న ప్రశ్న ప్రశ్న - వికాసానికి తొలి మెట్టు - అవగాహనకు పదును పెట్టు, దారిద్ర్య రేఖలు చెరపాలని కవిత్వ నావతో నా ఎదురీత, ప్రశ్న సంకెళ్లు తెంచే గండ్రగొడ్డలి, జాతీయ జెండా నేసినా - 'మానవ' మానం కాపాడినా - మగ్గానికి మరణ శాసనమాయె, ఓట్లు మనవే - పాట్లూ మనవే, సమతా మమతల సంస్థాపనే బౌద్ధం, మొన్న ఓటు -నిన్న 8 గంటల పని దినాలు-రేపో ఎల్లుండో ఆదివారానికి దినం, గొంతు మెదపక ప్రశ్నించక, ప్రతిధ్వనించక కలహించక కూర్చుంటే - నువ్వు మాయం నేను మాయం!!... అని సాగుతుంది మధు కవిత్వం. ఈ కవితా సంపుటి కవర్ పేజీని తెనాలికి చెందిన దివి హేమంత్ కుమార్ చాలా అద్భుతంగా డిజైన్ చేశారు.

150 పేజీల ఈ పుస్తకం వెల : రూ.150

రచయిత గోలి మధు సెల్: 9989186883

ప్రతులకు : 9848199098



సమీక్షకులు

**శిరందాసు నాగార్జున,**

సీనియర్ జర్నలిస్ట్, సెల్ : 9440222914

# త్వరలో కొత్తపేటలో అన్న క్యాంటీన్ ప్రారంభం

## - 5 రూపాయలకే అన్నార్తుల ఆకలిని తీర్చే అన్న క్యాంటీన్‌లు





**కొత్తపేట, (రాజధాని వార్తలు):** ఐదు రూపాయలకే ఆకలిని తీర్చే అన్న క్యాంటీన్ కొత్తపేటలో త్వరలో ప్రారంభం కాబోతోంది. ఇది అన్నార్తులకు ఎంతో ప్రయోజనం చేకూర్చనుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్న క్యాంటీన్‌లను ప్రధాన పట్టణ కేంద్రాలలో ప్రారంభించారు. నియోజవర్గాల వారీగా అంచలంచలుగా విస్తరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ ఆనాడు తెలియజేశారు. అన్న క్యాంటీన్ అవసరాన్ని గుర్తించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చొరవ తీసుకుని కొత్తపేటలో ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టారు. స్థల సేకరణ చేపట్టి నిధులు మంజూరుకు కృషి చేశారు. దాని ఫలితంగా కొత్తపేటలో త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభం కాబోతోంది. ఇటీవల ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్న క్యాంటీన్ పనులను పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులో తీసుకు రావాల్సిందిగా కాంట్రాక్టర్‌కు ఆదేశాలిచ్చారు. కొత్తపేటలో ముఖ్య కూడలిలో అన్న క్యాంటీన్ నిర్మించడం వలన విశేష ఆదరణ కలుగుతుందని పేర్కొనవచ్చు. ఇటు ప్రభుత్వ ఆసుపత్రికి సబ్ రిజిస్టర్ ఆఫీస్‌కు పూర్వపు ఎమ్మార్వో ఆఫీస్ దగ్గరగా రైతు బజార్ పక్కన బస్టాండ్ సెంటర్ వద్ద అన్న క్యాంటీన్ నిర్మిస్తున్నారు. అందరికీ అందుబాటులో నిర్మించడం అన్నార్తులకు ఎంతో ప్రయోజనకరం కానుంది. చుట్టుపక్కల ప్రాంతాల నుండి వివిధ పనులపై మండల కేంద్రం కొత్తపేట వచ్చే ప్రజలకు భోజన సమయంలో ఆకలి తీర్చే అక్షయ పాత్రగా నిలుస్తుందని హర్షిస్తూ మంచి స్థలాన్ని ఎన్నుకుని అన్న క్యాంటీన్ నిర్మిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావును మరియు కూటమి ప్రభుత్వాన్ని కొత్తపేట నియోజకవర్గ ప్రజానీకం ప్రసంశిస్తున్నారు. అన్ని పనులు పూర్తిచేసి త్వరలో ఈ అన్న క్యాంటీన్ ను ఎమ్మెల్యే సత్యానందరావు ప్రజలకు అందుబాటులోకి తీసుకు రాబోతున్నారు.

# కొమరం భీం ఆశయ సాధనకై ఉద్యమిద్దాం...

## ఆదివాసి హక్కులు చట్టాలు కాపాడుకుందాం



**చర్ల, (రాజధాని వార్తలు):** చర్ల మండలం అంబేద్కర్ సెంటర్లో 124వ కొమరం భీమ్ జయంతి ఘనంగా జరుపుకోవడం జరిగినది ఈ కార్యక్రమాన్ని ఆదివాసి జేఏసీ చైర్మన్ కోరం సూర్య నారాయణ అధ్యక్షతన జరిగినది కొమరం భీమ్ నిజం నవాబుల మీద దండయాత్ర చేసినాడు జల్ జంగిల్ జమీన్ భూమిశిస్తు పన్ను ఎందుకు కట్టాలి.? అని ఎదురు తిరిగిన గోండు బొబ్బిలి కొమరం భీమ్ ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ జోడేఘాట్‌లో జన్మించాడు ఆదివాసి హక్కుల కోసం నిరంతరం నిజం నవాబుల మీద పోరాడే యోధుడు మన్యం వీరుడు. ఆసిఫాబాద్ జోడేఘాట్ గుట్టలలో పోరాడి కుర్దు పటేల్ సమాచారంతో నిజం నవాబులతో పోరాడి అసులు బాసినా వీరుడు1901 జన్మించి- 1940లో మరణించడం జరిగింది అక్టోబర్ 22 కొమరం భీమ్ జయంతిగా చర్ల మండలంలో ఘనంగా జరుపుకుంటున్నాము. ఆదివాసి హక్కులు చట్టాలు పరిరక్షణకై ప్రతి ఒక్కరు కొమరం భీము ఆశయా సాధనకై ముందుకు నడవాలని ఆదివాసీలకు అందాల్సిన ఫలాలను ప్రతి ఒక్కరికి అందించే లాగా మనం పోరాడాలని పిలుపునిచ్చారు అన్నారుఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కంగాల. అభి, వైస్ చైర్మన్ కె. నరేష్,సిపిఐ డివిజన్ నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు,మాజీ జెడ్పిటిసి సోయం రాజారావు,మాజీ సర్పంచ్ కాపుల కృష్ణ సిపిఐ నూప పోతయ్య బిజెపి నూప రమేష్, శ్యామల రామారావు కాక రాంబాబు తోకల లక్ష్మీపతి సోయం శేషు,పర్షిక రాజు, మొడెం విజయ్ రావు, తుర్రం వీరభద్ర రావు, కారం కృష్ణ మోహన్, సరియమ్ సమ్మయ్య,పద్దం బాబు వజ్ర కృష్ణ, శ్యామల వీర్రాజు, అలవాల ఈశ్వర్, ఇరప అంజిబాబు, సోడి ప్రదీప్, తుర్రం రవి, కట్టం కన్నారావు, నీలం వెంకటరమణ, వనవాసి శోభన్, మాజీ ఎంపీపీ సోయం కృష్ణవేణి, దేశ ధనలక్ష్మి, పరిష్క అరుణ స్వరూప రాణి, సరిత, మంగమ్మ, సుజాత, తుర్రం రాజు, సోయం నరసింహారావు శ్యామల గోవిందు, తుర్రం రాజు, రమేష్, సోయం నరసింహారావు, తదితరులు అందరూ కొమరం జయంతి వేడుకలలో పాల్గొన్నారు.

# సాయి గౌతమ్ స్కూల్ విద్యార్థుల సత్తా

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక సాయి గౌతమి హై స్కూల్ క్రీడా మైదానంలో జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో సాయి గౌతమి స్కూల్ నుంచి ప్రాతినిధ్యం వహిం చిన క్రీడాకారులు, క్రీడాకారినిలు తమ సత్తా చాటారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి వివిధ క్రీడలకు సంబంధించి మండల జట్లకు ఎంపికయ్యారు. అండర్ - 14, అండర్ - 17 విభాగాలకు సంబంధించిన కోకో, కబడ్డీ, చెస్, యోగ, బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, త్వరలో జరగనున్న డివిజన్ స్థాయి పోటీల్లో తమ క్రీడాకారులు పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.ఎస్. నాయుడు బుధవారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి అభినందనలు తెలిపారు.




# తప్పని డోలి మోతలు

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** తరచూ గిరిజన గ్రామాల్లో కనిపించే డోలి మోత బుధవారం మర్రివలస గ్రామంలో కనిపించింది. బుధవారం ఈ గ్రామానికి చెందిన ముగడ రమణమ్మ అనే వృద్ధురాలు తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఈ గ్రామము చంపావతి నదికి ఆవల ఉంది. రెండు రోజులుగా చంపావతి నది ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ పరిస్థితుల్లో గ్రామస్తులు తప్పనిసరి పరిస్థితుల్లో డోలిమోతకు సిద్ధమయ్యారు. ఈ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాలంటే చంపావతి నది దాటాల్సిందే. ఈ నదిగుండా ఎప్పుడు సాధారణ స్థాయిలో నీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బంది లేకుండా గ్రామస్తులు ప్రయాణం సాగిస్తున్నారు. అయితే, రెండు రోజుల క్రితం ఆంధ్ర జలాశయం గేట్లు ఎత్తి నీరు విడుదల చేయడంతో చంపావతి నది ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో గ్రామస్తులు మంచాన్ని డోలిగా కట్టి



రమణమ్మను సురక్షితంగా చంపావతి నది ఒడ్డుకు చేర్చారు. అప్పటికే ఒడ్డున వేచి ఉన్న 108 అంబులెన్స్‌లో రమణమ్మను గజపతినగరం ఏరియా ఆసుపత్రికి తీసుకు వెళ్లారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

## - యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.కామేష్, ఎస్ రంగరాజు




**విజయనగరం, (రాజధాని వార్తలు):** మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్ష, కార్యదర్శులు జె. కామేష్, ఎస్ రంగరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అనేక ఇబ్బందులు పడుతున్న మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ఎన్నోసార్లు వినతి పత్రం సమర్పించిన స్పందించలేదన్నారు. దీనిలో భాగంగా రానున్న రోజుల్లో పలు నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈనెల 27న విశాఖపట్నం మున్సిపల్ ఆర్డీవో కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈనెల 29, 30 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద నిరాహారదీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవ్‌లు ఇవ్వాలని, కూటమి ప్రభుత్వం వెంటనే పిఆర్సి ప్రకటించాలన్నారు. ఔట్సోర్సింగ్‌లో పనిచేసే రిటైర్మెంట్ అయిన కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఆప్కాబ్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఔట్సోర్సింగ్ కార్మికులకు రిటైర్మెంట్ సమయంలో గ్రాడ్యుటి 75,000 ఇవ్వాలన్నారు. కార్మికులకు రాజకీయ వేధింపులు, సచివాలయ సెక్రెటరీ వేధింపులు ఉండకుండా చూడాలన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కాకపోతే అక్టోబర్ 3 నుండి సమ్మెకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు ఈ కార్యక్రమంలో తుపాకుల శ్రీను, కళ్యాణ శ్రీను, దలై శ్రీను, చిరంజీవి, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతోనే భీమిలి ఉత్సవ్ విజయవంతం : ఎమ్మెల్యే గంటా



**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** జీవీఎంసీ, టూరిజం, విద్యా తదితర ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేసి భీమిలి ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భీమిలి ఉత్సవ్ ను ప్రజలకు, టూరిస్టులకు అనుకూలమైన తేదీల్లో నిర్వహించాలని సూచించారు. భీమిలి చారిత్రక గొప్పదనాన్ని తెలియజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఉండాలన్నారు. కోలాటాలు, బోట్ రేసింగ్, పారా గ్లైడింగ్, బీచ్ వాలీబాల్, కబడ్డీ, డ్రాయింగ్, రంగోలి, కుకింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు అధికారులు చెప్పగా.. ఉత్సవ్‌లో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. టీడీపీ హయాంలో క్రమం తప్పకుండా ఎంతో ఉత్సాహంగా జరిపిన ఉత్సవ్ ను వైసీపీ హయంలో నిర్వహించకుండా ఆ స్ఫూర్తిని నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఈ సమావేశంలో టూరిజం రీజనల్ డైరక్టర్ కల్యాణి, జిల్లా టూరిజం అధికారి మాధవి, డివిజనల్ మేనేజర్ జగదీష్, భీమిలి జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ కోటి సంతకాల సేకరణలో భాగస్వామ్యం కావాలి





**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** కోటి సంతకాల సేకరణ లో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని నియోజకవర్గం వైకాపా ఇంచార్జి మజ్జి శ్రీనివాసరావు కుమార్తె మజ్జి సిరమ్మ పిలుపునిచ్చారు. జీవిఎంసీ 3వ వార్డుకు సంబంధించి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం వార్డు అధ్యక్షులు అల్లిపిల్లి నరసింగరావు ఆధ్వర్యంలో భీమిలి పాత బస్టాండ్ వద్ద బుధవారం నిర్వహించగా మజ్జి సిరమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రంలో పేదవాడికి విద్య వైద్య అందుబాటులో లేదని ఆవేదన వ్యక్తం చేసారు. మెడికల్ కాలేజ్ పేద ప్రజలకు ఆరోగ్యానికి జీవనాడి అని వాటిని ప్రైవేట్ పరం చేస్తే పేద వాడికి వైద్యం ఎక్కడ అందుతుందని ఆమె అన్నారు. సంతకాల సేకరణలో ఆమె ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం కొంత సమయం తర్వాత నియోజకవర్గం ఇంచార్జి మజ్జి శ్రీనివాసరావు ఇదే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భవిష్య త్తులో ప్రతి ఒక్క పేద, మధ్యతరగతి కుటుంబాలు చదవాలన్న వైద్యం చేయించుకోవాలన్నా ప్రైవేటీకరణ అనేది ఆపడం ఒక్కటే మార్గమని జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రైవేటీకరణ ఆపడానికి కోటి సంతకాల సేకరణలో అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైలపిల్లి షణ్ముఖరావు, కదిరి ఎల్లాజీ, మైలపల్లి లక్ష్మణరావు, వాసుపల్లి కొండబాబు, ఎర్రయ్య రెడ్డి, ప్రభాకర్ నాయుడు, మధు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక, మట్టి దందాలపై పెట్టిన శ్రద్ధ రోడ్లపై పెట్టాలి

## - ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకునే నాథుడు లేడు - ప్రాణాలు పోయే దాకా పట్టించుకోరా? : మాజీ ఎం ఎల్ ఏ మెచ్చా నాగేశ్వరరావు

**అశ్వరావుపేట, (రాజధాని వార్తలు):** అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎంఎల్ఏ, బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ములకలపల్లి మండలంలో కార్యక్రమానికి వెళ్తున్న క్రమంలో అంకంపాలెం దాటిన తరువాత అడవి నుంచి అడుగడుగున రోడ్డు గుంతలతో దర్శనం ఇవ్వడంతో గంగారం వద్ద కారు దిగి పరిశీలించి స్థానికంగా ఉన్న వారితో మాట్లాడగా నిన్న రాత్రి కూడా ఈ గుంతల కారణంగా ప్రమాదం జరిగిందని ఎవరికి చెప్పిన పట్టించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు రేగ కాంతారావు ఇచ్చిన (గుంతలతో సెల్ఫీ) పిలుపు మేరకు అశ్వారావుపేట మాజీ ఎంఎల్ఏ మెచ్చా నాగేశ్వరరావు గుంతలతో సెల్ఫీ దిగి కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక మట్టి దందాలపై పెట్టిన శ్రద్ధ రోడ్లపై పెట్టాలని. 22 నెలలు అవుతున్నా తట్టెడు మట్టి పోసిన పాపాన పోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి లేదని ప్రమాదాలు జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రాణాలు పోయేదాకా చూస్తూ ఉంటారా అని మండిపడ్డారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో పోసిన రోడ్లు తప్ప కొత్తగా ఈ 22 నెలల్లో కాంగ్రెస్ చేసింది ఏమి లేదని. బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో మంజూరై మొదలైన పనులను సైతం గాలికి వదిలేశారని, ముఖ్యమంత్రి నుంచి ఎంఎల్ఏల వరకు మళ్ళీ గెలవడం కష్టమనే విషయం తెలిసి గెలిపించిన ప్రజలు ఏమైపోతే మాకెందుకు మా కడుపులు నిండాలని అందరూ దోచుకునే పనిలో నిమగ్నమైపోయారని,




వెంటనే అంకంపాలెం అడవి నుంచి ములకలపల్లి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని లేకపోతే రోడ్డు పై ధర్నాకు సిద్ధం అవుతామని కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరించారు.

# సంపాదకీయం

## హమాస్ దుర్మార్గం ఇజ్రాయెల్ అమానుషం

అక్టోబర్ 7, 2023న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడి, నాజీ పాలన తర్వాత జరిగిన అతి పెద్ద మానవ ఊచకోత. ఈ దాడి ప్రధానంగా జరిగింది మిలిటరీ మీద కాదు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం చనిపోయిన వారిలో సుమారు 850మంది పౌరులు ఉండగా 350మంది మిలిటరీ పోలీసులు ఉన్నారు. ఈ దాడిలో సేఫ్ హౌస్‌లో దాక్కోడానికి ప్రయత్నించిన సాధారణ పౌరులను - వారు పిల్లలా, వృద్ధులా అన్నదానితో సంబంధం లేకుండా మంటల్లో తగలబెట్టారని ఐక్యరాజ్యసమితి నిర్ధారించింది. లూటీలు జరిగాయని, తలలు నరికివేయడం కూడా జరిగిందని ఆ నివేదిక తేల్చిచెప్పింది. అంతేగాక సెక్సువల్ వయెలెన్స్ మీద ఐరాస సెక్రెటరీ జనరల్ జరిపిన ప్రత్యేక పరిశోధనలో కిబ్బుట్జ్ ప్రాంతంలో రేప్‌లు, గ్యాంగ్ రేప్‌లు జరిగాయని తేలింది. ఎన్నోచోట్ల స్త్రీల అర్ధనగ్న, నగ్న దేహాలు పడివున్నాయని, మర్మాంగాల ఛేదనం జరిగిందని ఆ ఐరాస బృందం కనుగొన్నది. ఈ బృందం సుమారు 5000 ఫొటోలు, 50 గంటల నిడివి ఉన్న ట్రాఫిక్ కెమెరాలతో సహా అన్ని రకాల ఆడియో, వీడియో ఫైళ్లనూ పరిశీలించి, ప్రత్యక్ష సాక్షులను విచారించి ఈ నివేదికను రూపొందించింది. 'హమాస్' అనే పేరు 'హరకత్ అల్ ముఖవా అల్ ఇస్లామియా' అన్న పూర్తిపేరుకు క్లుప్తపదం. దీనికి అర్థం 'ఇస్లామిక్ ప్రతిఘటన ఉద్యమం' అని. ఈ సంస్థ ఫండమెంటల్ స్వభావం కలిగినది. యాసర్ అరాఫత్ నాయకత్వంలో పాలస్తీనా విమోచన ఉద్యమంలో భాగంగా ఏర్పడిన పార్టీ 'ఫతా'. ఈ ఫతా పార్టీ పాలస్తీనాలోని వెస్ట్ బ్యాంక్‌ను పాలిస్తుంది. ఫతా పార్టీ ఆదర్శం ఒక సర్వసత్తాక, గణతంత్ర, లౌకిక పాలస్తీనాను ఏర్పరచడం. అయితే హమాస్ భావజాలం అందుకు భిన్నమైనది. కేవలం ఇస్లాం మత సౌభ్రాతృత్వంతో కూడిన పాలస్తీనాను ఏర్పరచడమే దాని ఆదర్శం. ఆ సంస్థ 1988లో తన శాసనావళిలో స్పష్టంగా%-% ఇజ్రాయెల్‌ను తుడిచిపెట్టేసి జోర్డాన్ నది నుంచి మధ్యధరా సముద్రం దాకా పాలస్తీనా 'ఇస్లామిక్' సామ్రాజ్యాన్ని ఏర్పరచడం తన ఆదర్శమని రాసుకున్నది. హమాస్ ఇంతటి స్పష్టమైన ఉద్దేశంతో ఏర్పడటంతో సహజంగానే ఇజ్రాయెల్‌లో దీనిపట్ల అప్రమత్తత నెలకొన్నది. 2007 ఎన్నికల్లో ఫతా పార్టీని హమాస్ గాజాలో ఓడించింది (132 సీట్లకు గాను 74 సీట్లు గెలుచుకుంది). ఆ తర్వాత ఫతా సంస్థపై దాడులు, హత్యలు, చిత్రహింసలతో విరుచుకుపడింది. చివరకు ఆ ప్రాంతంలో తానే ఏకైక పార్టీగా మిగిలి, అధికారం చెలాయిస్తూ వచ్చింది. మిలిటరీ హత్యాకాండను నమ్ముతూ, తమను రూపు మాపే లక్ష్యంతో ఉన్న హమాస్ అధికారంలోకి రావటంతో సహజంగానే ఇజ్రాయెల్ 2007 తర్వాత గాజా చుట్టూ ఒక పూర్తి నిర్బంధ స్థితిని తీసుకువచ్చింది. అంతవరకు అమెరికా, యూరోప్‌ల నుంచి మిలియన్ డాలర్లలో అందే ఆర్థిక సహాయం కూడా నిలిచిపోయింది. హమాస్ ఒక విముక్తి పోరాట సంస్థ అని చెప్పే వాళ్లకు విప్లవం ఎలా ఉంటుందో తెలియకపోయి ఉండాలి, లేదా అది 'ఫాల్స్ గ్లోరిఫికేషన్' ద్వారా సమర్థించడం అయినా అయి ఉండాలి. మన దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ పార్లమెంట్‌లో బాంబులు వేసాడు గాని, వెళ్లి బ్రిటీష్ కుటుంబంలో చిన్నపిల్లల మీద, ఇంట్లో స్త్రీల మీద బాంబు వేయలేదు. మన దేశంలో మిలిటరీ విముక్తి పోరాటం చేస్తోందని చెప్పుకునే అతి పెద్ద సాయుధ పోరాట మావోయిస్ట్ సంస్థ కూడా ఇందులో కనీసం ఒకటవ వంతు హత్యాకాండకు కూడా పాల్పడలేదు. కేవలం మిలిటరీ పైన, పోలీసుల పైన, అధికార యంత్రాంగం పైన మాత్రమే దాడులు చేయడం అన్నది ఏ విముక్తి పోరాటం అయినా పాటించే ఒక అలిఖిత యుద్ధ న్యాయం. నక్సలైట్లు భూస్వాముల ఇళ్లల్లోకి ప్రవేశించి భూస్వాములను చంపిన సందర్భాలు ఉన్నాయి కానీ, వాళ్ల ఇంట్లో భార్యలను చెరచడం, పిల్లల్ని తగలబెట్టడం జరగలేదు. హింసను అంగీకరించడం అంగీకరించకపోవడం అది వేరే చర్చ. ఏ దిశా లేని హింస అన్నది కేవలం టెర్రరిజం మాత్రమే! అయితే హమాస్ నాయకుడు ఘజీ హమద్ "మేము అక్టోబర్ 7న చేసిన హత్యాకాండ వల్లనే ఈ రోజు ప్రపంచం మా సమస్యను గుర్తిస్తున్నది" అని ప్రకటించాడు. అడ్డూ అదుపూ లేని ఏ హింసనైనా ఎవరైనా గుర్తిస్తారు. ఆ గుర్తించేది ఏ దృక్పథంతో గుర్తిస్తున్నారు అన్నది ముఖ్యం. ఈ కనీస ఆలోచన లేని యుద్ధ వీరులు చేసే దుర్మార్గాన్ని లిబరల్స్ ఏ మాత్రం విచక్షణ లేకుండా తలకెత్తుకోవడం ఈ ప్రపంచ మానవ సమాజం చేసుకున్న దురదృష్టం. పాలస్తీనా సమస్య వేరు, హమాస్ ప్రతిఘటన వేరు. ఈ రెంటి మధ్య అయోమయానికి గురై, రెండిటినీ ఒకే రకంగా తలకెత్తుకోవడం అవివేకం. హమాస్ దాడి తర్వాత ఇజ్రాయెల్ ప్రతిస్పందన మరింత అమానుషం! అందులో 'proportionate response' అన్నది లేదు. హమాస్ సభ్యులు ఇళ్ల కింద, హాస్పిటల్స్ కింద టన్నెల్స్‌లోనూ దాక్కున్నారని చెప్పి ఇజ్రాయెల్ ఎడాపెడా హాస్పిటళ్లను, స్కూళ్లను పేల్చివేస్తుంటే మానవ సమాజం యావత్తూ సాక్షులుగా మిగిలిపోవాల్సి రావటం దారుణమైన స్థితి! ప్రపంచంలోనే అతిపెద్ద, అతిశక్తిమంతమైన సీక్రెట్ ఏజెన్సీగా పేరుమోసిన ఇజ్రాయెల్‌కి చెందిన 'మొసాద్' కూడా అక్టోబర్ దాడిని పసిగట్టలేకపోయిందంటే ఎంత సిగ్గుమాలిన విషయం! దాడి జరిగిన తర్వాత బందీలు ఎక్కడున్నారో, హమాస్ మిలిటెంట్లు ఎక్కడున్నారో కూడా ఆ ఏజెన్సీ పసిగట్టలేకపోయింది. ఫలితంగా ఎక్కడపడితే అక్కడ ఎయిర్ స్ట్రైక్స్ చేసి 67,000 మందిని ఇజ్రాయెల్ పొట్టనబెట్టుకుంది. ఇందులో 70 శాతం స్త్రీలు, పిల్లలు ఉన్నారు! అందులో హమాస్ మిలిటెంట్స్ 20 శాతం కూడా లేరు అని అంతర్జాతీయ మీడియా నివేదికలు చెప్తున్నాయి. ఇజ్రాయెల్ ఇది 'కొలేటరల్ డ్యామేజ్' అని నచ్చచెప్తోంది. తమాషా ఏమంటే... 'ఇదంతా ఒట్టి కొలేటరల్ డ్యామేజ్ మాత్రమే! మెయిన్ డ్యామేజ్ అతి స్వల్పం! అంటే ఒక్క మిలిటెంట్‌ను చంపాలంటే నలుగురు సాధారణ పౌరులను చంపవచ్చు' అని ఇజ్రాయెల్ ఇక్కడ తీర్మానిస్తున్నది.

## అన్నా క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోనలో నిర్మిస్తున్న అన్నా క్యాంటీన్ నిర్మాణ పనులను అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి పరిశీలించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌తో కలిసి బుధవారం అన్నా క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంపీ హరీష్ మాట్లాడుతూ త్వరలోనే భావన నిర్మాణం పూర్తి చేసి అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తామని అన్నారు. పేదల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో 5 రూపాయలకే భోజనాన్ని అందించడం కూటమి ప్రభుత్వం ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఇప్పటి వరకూ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఈ అన్న క్యాంటీన్‌లను త్వరలో మండల కేంద్రాలలో అందుబాటులోకి ప్రభుత్వం తీసుకొస్తుందని ఎంపీ హరీష్ పేర్కొన్నారు.

## అల్లవరం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ మీనా

**అల్లవరం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం పోలీసు స్టేషన్‌ను జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాహుల్ మీనా బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్టేషన్ పరిస్థితులు, రికార్డులను ఆయన పరిశీలించారు. మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు, పరిస్థితులపై ఆయన ఎస్ఐ సంపత్ కుమార్‌ను ఆరా తీశారు. కార్తీకమాసం సందర్భంగా మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, దేవాలయాలు, పర్యాటక కేంద్రాలు, తీరంలో సముద్ర స్నానాలు వంటి వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్తీకమాసం సందర్భంగా సముద్ర స్నానాలకు వెళ్లే పర్యటకుల, భక్తుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని తగిన భద్రతా చర్యలు చేపట్టి సూచనలు సలహాలతో



అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడేది లేదని సిబ్బంది అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని, ముందస్తు సమాచారాన్ని సేకరించి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు.

## శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ భూమి పూజ






**వింజమూరు, (రాజధాని వార్తలు):** ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు మండలం గుండెమడకల గ్రామంలో భక్తుల జయజయ ద్వానాలు వేద పండితుల మంత్రోచ్చరణలతో శాస్త్రోక్తంగా హెూమం, భూమి పూజ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి పాల్గొన్న రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నిర్వహించారు. ఈ ఆలయ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి.పాల్గొన్నారు. మంత్రికి అపూర్వ స్వాగతం పలికిన గుండె మడకల గ్రామస్తులు, స్థానిక ప్రజా ప్రతిని ధులు.. ఈసందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ ఆలయం కోటి రూపాయల టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులతో గుండె మడకల గ్రామంలో శ్రీ సీతారామాంజనేయ స్వామివారి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. గుండెమడకల గ్రామంతో తమ కుటుంబానికి మంచి అనుబంధం ఉందని ఆయన చెప్పారు. ఈ ఆలయ నిర్మాణం కోసం స్థానిక నాయకులు, గ్రామస్తులు పలుసార్లు విజ్ఞప్తి చేశారు.

నేడు ఈ మహత్కార్యానికి శ్రీకారం చుట్టడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు. శ్రీ సీతారా మాంజనేయ స్వామి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించేందుకు అన్ని విధాలా కృషి చేస్తానని మంత్రి ఆనం హామీ ఇచ్చారు.

## ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి : గూడూర్ డిఎస్పీ గీత కుమారి



**గూడూరు, (రాజధాని వార్తలు):** ఉమ్మడి నెల్లూరు జిల్లా, తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని గూడూరు డిఎస్పి గీతా కుమారి తెలియజేశారు. వారు మాట్లాడుతూ వచ్చే రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ప్రతి ఒక్కరూ భద్రతాపరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి అని సూచించారు. పాడుబడిన భవనాలు, హెూర్డింగ్ బోర్డులు, చెట్లు లేదా విద్యుత్ తీగల దగ్గర ఉండవద్దు. వాగులు, వంకలు, చెరువులు, నదులు మరియు లోతైన నీటి గుంటల వద్దకు వెళ్లవద్దు అని సూచించారు. అవసరంలేకుండా బయటకు రాకండి రోడ్లపై నీటి ప్రవాహం ఉన్నచోట ప్రయాణించవద్దు. వాగులు, కాలువలు దాటేటప్పుడు అత్యవసరం అయినా వాహనాలతో దాటవద్దు. రీల్స్ లేదా సెల్ఫీలు తీసుకోవద్దు. తల్లిదండ్రులు పిల్లలను నీటి ప్రాంతాల వద్ద ఆడనీయకుండా జాగ్రత్త వహించాలి. నీటి మట్టం అకస్మాత్తుగా పెరగవచ్చు. చెట్లు కూలిపోవడం, విద్యుత్ తీగలు తెగిపోవడం లేదా వాగులు పొంగిపోవడం వంటి ఘటనలు గమనిస్తే వెంటనే పోలీసులకు లేదా విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వండి. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం కోసం డయల్ 112 సేవను వినియోగించుకోండి. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. మీ భద్రత, మీ కుటుంబ భద్రత కోసం పోలీస్ సూచనలు తప్పక పాటించండి" అని గూడూరు ఎస్డీపీవో గీత కుమారి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## సంక్రాంతికి ఆత్రేయపురంలో జరిగే జాతీయస్థాయి బోట్ ఫెస్టివల్‌కి సహకరించండి

**కొత్తపేట, (రాజధాని వార్తలు):** ఎమ్మెల్యే బండారు సత్యానందరావు బుధవారం విజయవాడలో ఏ.పి.టి.డి.సి ప్రాజెక్ట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యం.శేషగిరిని కలిశారు. రానున్న సంక్రాంతికి ఆత్రేయపురం వద్ద నిర్వహించనున్న జాతీయస్థాయి బోట్ ఫెస్టివల్‌కు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఈసారి జాతీయ స్థాయిలో పడవల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా ఏర్పాట్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో లొల్ల లాకుల వద్ద టూరిజం అభివృద్ధి మరియు వాడపల్లిలో రివర్ ఫ్రంట్ రిసార్టుల నిర్మాణం తో పాటు వాడపల్లి, మందపల్లి, పలివెల, ర్యాలి మొదలైన ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం అభివృద్ధికి సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలను కలుపుతూ బస్సులు ఏర్పాటు



కొరకు అనుమతులు, టూరిజం అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెపక్ తక్రా జట్టు కోచ్‌గా కానిస్టేబుల్ గౌతమ్



**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఈ నెల 23 నుండి 27 వరకు గోవా రాష్ట్రం మాగ్దోన్ ప్రాంతములో జరిగే 35వ సీనియర్ పురుష మరియు స్త్రీల జాతీయ స్థాయి సెపక్ తక్రా క్రీడా పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు పురుషల కోచ్ గా అమలాపురంకు చెందిన కానిస్టేబుల్ ఎన్ ఎస్ ఎన్ఐఎస్ కోచ్ యాండ్రా గౌతమ్ నియమితులైనట్లు డాక్టర్ బి.ఆర్ అం బేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు జవ్వాడి తాతబాబు తెలిపారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెపక్ తక్రా అసోసియేషన్ కార్యదర్శి జి శ్రీనివాసులు జారీ చేసినట్లు తాతబాబు తెలిపారు. జాతీయ స్థాయిలో కోచ్ యాండ్ర గౌతమ్ నియమించడం అభినందనీయమని విధి నిర్వహణలో ఉండే పోలీస్‌లు జాతీయ స్థాయిలో రాణించడమే కాకుండా ఎంతో మందిని జాతీయ స్థాయి క్రీడాకారులుగా తయారు చేసిన కృషి ఫలితంగానే గౌతమ్‌కు జాతీయ స్థాయిలో కోచ్‌గా నియమితులయ్యారని తెలిపారు. రాష్ట్ర జట్టు కోచ్‌గా ఎంపిక కావడం పట్ల డా బి. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాహుల్ మీనా, అడిషనల్ ఎస్పీ ఏ వి ఆర్ పి బి ప్రసాద్ గౌతమ్‌ను అభినందించారు.

## వేములవాడలో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు

### - "మన గ్రామ శుభ్రత మనందరి బాధ్యత" : ఎంపీడీవో శ్రీనివాసరావు



**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం, వేములవాడ గ్రామ పరిశుభ్రతను మెరుగు పరిచే దిశగా అధికారులు ప్రత్యేకచర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణపై అవగాహన సదస్సును డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లా డుతూ గ్రామస్తులు ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్లపై లేదా డ్రైనేజీల్లో వేయకుండా ప్రత్యేకంగా భద్రపరచాలని సూచించారు. ఒకసారి వాడే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించడం వల్ల గ్రామం శుభ్రంగా ఉండే అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం ద్వారా పునర్వినియోగ అవకాశాలు పెరుగుతాయని, ఇది పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని, శుభ్రమైన గ్రామాల ద్వారానే ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం తరపున వచ్చే ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్ పై గ్రామస్తుల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి ఉమామహేశ్వరి, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## స్వామివారి వెండి వస్తువులు అప్పగింత

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఏలేశ్వరం మండలం కంబాల పాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి చెందిన సుమారు ఒకటిన్నర కిలో బరువు గల వెండి వస్తువులు ఆలయ ధర్మకర్తలు పోగొట్టుకోగా వాటిని వెతికి సామర్లకోట పోలీసులు వారికి అప్పగించారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ ఏ కృష్ణ భగవాన్ మాట్లాడుతూ ఆలయానికి చెందిన సుమారు ఒక కిలో ఒక పైబడి పాత వెండి వస్తువులైన స్వామి వారి శఠగోపం, పడగలు అమ్మవారి కళ్ళు వంటి చిన్న చిన్న వెండి వస్తువులు పాతగిల్లగా వాటిని మార్చు కునేందుకు ఆలయ కమిటీ సభ్యులు కొప్పిశెట్టి సత్తిబాబు, సొంటెపు బాలకృష్ణలు కాకినాడ తీసుకు వెళుతుండగా మార్గమధ్యంలో సంచి తెగిపోయి వెండి సామాన్లను పోగొట్టుకున్నారు. దానితో సామర్లకోట పోలీసులను వారు ఆశ్రయించగా హెడ్ కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుల్ నాగరాజులు వాటిని మెయిన్ రోడ్‌లో కనుగొన్నట్టు చెప్పారు. అయితే సంచి పై నుండి వాహనాలు ఎక్కడంతో ఆలయ సామాగ్రి కొంతవరకు పాడవగా వాటిని శుభ్రపరచి ఆలయ కమిటీ సభ్యులకు తిరిగి అప్పగించినట్టు సీఐ చెప్పారు. పోగొట్టుకున్న స్వామివారు, అమ్మ వారల వస్తువులు వెతికి అప్పగించిన పోలీసులకు ఆలయ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆ విషయంలో రాజా సాబ్ టెన్షన్ ఫ్రీ




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా చేస్తున్న సినిమాల్లోది రాజా సాబ్ కూడా ఒకటి. మారుతి దర్శకత్వంలో ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతుంది. అయితే ఈ సినిమాపై మొదట్లో ఎలాంటి అంచనాల్లేవు. ఇంకా చెప్పాలంటే మారుతితో సినిమా ఏంటని, ఈ సినిమాను ఆపేయమని డార్లింగ్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో ట్రెండ్ కూడా చేశారు. పోస్టర్లు, టీజర్‌తో అంచనాలను పెంచేసిన మారుతి కానీ ప్రభాస్ మాత్రం కంటెంట్‌ను, మారుతిని నమ్మి సినిమాను కంటిన్యూ చేశారు. మారుతి కూడా తనకు ప్రభాస్ పై ఉన్న ప్రేమను మాటల్లో కాదు, చేతల్లోనే చూపిస్తానని ఇప్పటికే పలుమార్లు చెప్పుకుంటూ వచ్చారు. అయితే ఎప్పుడైతే రాజా సాబ్ నుంచి పోస్టర్లు, గ్లింప్స్, టీజర్ వచ్చాయో అప్పట్నుంచి రాజా సాబ్ పై విపరీతమైన బజ్ ఏర్పడింది. అందరూ రాజా సాబ్ కోసం ఎదురుచూడటం మొదలుపెట్టారు. వాస్తవానికైతే రాజా సాబ్ ఇప్పటికే రిలీజవాల్సింది కానీ మధ్యలో షూటింగ్ లేటవడం వల్ల సినిమా వాయిదా పడింది. డిసెంబర్‌లో సినిమాను రిలీజ్ చేద్దామనుకున్న మేకర్స్ తర్వాత సంక్రాంతి సీజన్ అయితే బావుంటుందని జనవరి 9కి వాయిదా వేశారు. ఇదిలా ఉంటే ఈ సినిమా షూటింగ్ ఇప్పుడు ఫైనల్ స్టేజ్‌కు వచ్చినట్టు తెలుస్తోంది. కేవలం ఒక్క ఫైటింగ్ సీన్ మాత్రమే పెండింగ్ ఉందని, ప్రభాస్‌కు సంబంధించిన షూటింగ్ అయితే పూర్తైందని సమాచారం. మరో వారం రోజుల్లో ఆ మిగిలిన షూటింగ్ కూడా పూర్తవుతుందని, ఆ తర్వాత నుంచి చిత్ర యూనిట్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌ను చూసుకోనుందని తెలుస్తోంది. కాగా మూవీ రిలీజ్‌కు మరో రెండు నెలలుంది. వీఎఫ్ఎక్స్, సీజీ భారీగా అవసరమున్న సినిమా కావడంతో రెండు నెలలనేది ఎక్కువ సమయమేమీ కాదు. కానీ రాజా సాబ్‌కు సంబంధించిన సీజీ వర్క్స్ కూడా చాలా వరకు పూర్తయ్యాయట. మధ్యలో షూటింగ్‌కు బ్రేక్ వచ్చిన టైమ్‌లో మారుతి ఆ పనుల్ని చేయించారని దీంతో ఇప్పుడు చిన్న చిన్న పనులే పెండింగ్ ఉన్నాయని తెలుస్తోంది. కాబట్టి ఈ రెండు నెలల్ని రీరికార్డింగ్, మిక్సింగ్, ఎడిటింగ్‌కు వాడి మిగిలిన టైమ్‌ను ప్రమోషన్స్‌కు కేటాయించాలని చిత్ర యూనిట్ భావిస్తుందట. సాధారణంగా ఈ మధ్య పెద్ద సినిమాలన్నీ చెప్పిన రిలీజ్ డేట్‌ను అందుకోవడానికి నానా కష్టాలు పడుతుంటే, రాజా సాబ్ మొత్తం షూటింగ్‌ను చాలా ముందుగానే పూర్తి చేసుకుని ఎలాంటి టెన్షన్ లేకుండా ఫ్రీ అయిపోతుంది. కామెడీ హార్రర్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో మాళవికా మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తుండగా, సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ రాజా సాబ్‌ను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది.

# బన్నీ వర్సెస్ మహేష్ నాన్ స్టాప్ ఫైట్!





బాహుబలి ది కన్ క్లూజన్ 1810 కోట్లు సాధిస్తే పుష్ప 2 ఏకంగా 1870 కోట్ల వసూళ్లతో రికార్డును బ్రేక్ చేసి బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డును నెలకొల్పింది. బాలీవుడ్ హీరోల బాక్సాఫీస్ రికార్డులను సైతం నార్త్ బెల్ట్‌లో తిరగరాసిన చిత్రంగా నిలిచింది. మరి ఇప్పుడీ రికార్డులు కొట్టేది ఎవరు? అంటే ఎస్ ఎస్ ఎంబీ 29తో అది సాధ్యమవుతుంది. రాజమౌళి దర్శకత్వంలో ఈ చిత్రం భారీ కాన్వాస్‌పై తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఏకంగా 120 దేశాల్లో ఈ చిత్రం రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు జక్కన్న. ఈ నేపథ్యంలో ఓపెనింగ్ సహా హిట్ టాక్ తెచ్చుకుంటే 5000 కోట్లు సాధ్యమే అన్న మాట ఇప్పటికే జోరుగా వినిపిస్తుంది. అదే జరిగితే పుష్ప2 విజయంలాంటి రెండు చిత్రాల రికార్డులు తిరగ రాసినట్లే. మరి అది జరుగుతుందో? లేదా? అన్నది రిలీజ్ తర్వాత సంగతి. అలాగే ఎస్ ఎస్ ఎస్ ఎంబీ 29 చిత్రం కూడా బన్నీ 22వ చిత్రంతో క్లాష్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం రెండు చిత్రాలు ఆన్ సెట్స్‌లో ఉన్న సంగతి తెలిసిందే. బన్నీ 22వ చిత్రానికి అట్లీ దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాపై అంచనాలు ఏ రేంజ్‌లో ఉన్నాయో చెప్పాల్సిన పనిలేదు. అలాగే మహేష్ -రాజమౌళి సినిమాపై అదే స్థాయిలో అంచనాలున్నాయి. ఈ రెండు సినిమాలు ఒకేసారి రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. 2027లో రిలీజ్ సంకేతాలు ఇప్పటికే అందుతున్నాయి. ఒకవేళ అదే జరిగితే రెండు చిత్రాల మధ్య బిగ్ ఫైట్ తప్పదు. ఆ రెండింటిలో ఏ సినిమాపై చేయి సాధిస్తుంది? అన్నది అంతకంతకు ఆసక్తికరంగా మారుతుంది. ఈ సమయంలో ఎస్ ఎస్ ఎంబీ 29 పై రెండు రకాల టార్గెట్లు ఫిక్స్ నైట్లు చెప్పొచ్చు. ఒకటి పుష్ప 2 రికార్డులతో పాటు, బన్నీ 22వ చిత్రంతో ధీటుగా పోటీ పడాలి. మరి ఈ రెండు సినిమాల మధ్య ఎలాంటి క్లాష్ తలెత్తుందో చూడాలి. రెండు చిత్రాలు గ్లోబల్ స్థాయి అప్పిరియన్స్ ఉన్నవే. ఇంటర్నేషనల్ మార్కెట్‌కి కనెక్ట్ చేస్తూ రిలీజ్ ప్లానింగ్ జరుగుతోంది. పాన్ ఇండియాలో మహేష్ సినిమా చేయనప్పటికీ రాజమౌళి ఇమేజ్‌తో ఇక్కడ మార్కెట్ పెద్ద విషయం కాదు. ఆయన బ్రాండ్ తో సినిమా జనాల్లోకి వెళ్లిపోతుంది. గొప్ప నటుడిగా ఎలాగూ మహేష్‌కి పేరుంది. అందుకే ఆ ద్వయం నేరుగా గ్లోబల్ మార్కెట్ పై కన్నేసి బరిలోకి దిగుతుంది. ఇక బన్నీ పాన్ -అట్లీ పాన్ ఇండియాని దున్నేసిన ద్వయం కాబట్టి వారి టార్గెట్ నేరుగా గ్లోబల్ స్థాయిలోనే కనిస్తోన్న సంగతి తెలిసిందే.

# డీప్ ఫేక్ చేస్తే శిక్ష తప్పదు.. చిరంజీవికి కోర్టు రక్షణ



డీప్ ఫేక్- మార్ఫింగ్ ఫోటోలు, వీడియోలతో తమకు తీవ్రమైన ఆర్థిక నష్టంతో పాటు పరువు నష్టం కూడా కలుగుతోందని సెలబ్రిటీలు ఆందోళన చెందుతున్నారు. డిజిటల్ విప్లవ పర్యవసానంలో ఎప్పుడు ఏం జరుగుతోందో ఊహించలేని పరిస్థితి ఉంది. ఇటీవలి కాలంలో ఏఐలో సృష్టించిన ఫేక్ ఫోటోలు, వీడియోలలోని ఒరిజినల్ వ్యక్తిత్వాన్ని సాధారణ ప్రజలు గుర్తించడం అంత సులువు కాదు. చాలా అసభ్యకరమైన వెబ్ సైట్లు, వాణిజ్య కంటెంట్ ఉన్న వెబ్ సైట్లు సెలబ్రిటీల ఫోటోలు, వాయిస్‌లు, ఏఐ వీడియోలను విచ్చలవిడిగా దుర్వినియోగం చేయడం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. తమ స్వార్థపూరిత వ్యాపార ప్రయోజనాల కోసం సెలబ్రిటీలకు చెడ్డ పేరు తేవడానికి కూడా కొన్ని వెబ్ సైట్లు వెనకాడటం లేదు. అయితే మారిన ఈ పరిస్థితుల నేపథ్యంలో బాలీవుడ్ స్టార్లు అభిషేక్ బచ్చన్, ఐశ్వర్యారాయ్ ఇప్పటికే ఢిల్లీ కోర్టును ఆశ్రయించగా, వారికి అన్ని కోణాల్లోను ఉపశమనం కలిగిస్తూ న్యాయమూర్తులు తీర్పును వెలువరించారు. దాదాపు 30-40 వెబ్ సైట్ల నుంచి వారి డీప్ ఫేక్ ఫోటోలు, వీడియోలు, వాయిస్‌లు వగైరా తొలగించడానికి అనుమతులు లభించాయి. ఆ తర్వాత తన హక్కులను కూడా పరిగణించి ఇలాంటి ఫేక్ వ్యవహారాల నుంచి రక్షణ కల్పించాలని టాలీవుడ్ కింగ్ నాగార్జున కోర్టును ఆశ్రయించగా, అక్కడ అనుకూల తీర్పు వెలువడింది. నాగార్జునకు ఉపశమనం లభించింది. ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవి కూడా హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా అనుకూల తీర్పు వెలువడిందని సమాచారం. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి పేరు, ఇమేజ్, వాయిస్ లేదా పోలికను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో, AI-జనరేటెడ్, మెటావర్స్ ఫార్మాట్‌లు సహా ఎక్కడైనా అనధికారికంగా ఉపయోగిస్తే దానికి శిక్ష తప్పదు. అలాంటి చర్యలపై కోర్టు తాత్కాలిక నిషేధం విధించింది. సెప్టెంబర్‌లోనే అందుకు సంబంధించిన ఉత్తర్వు వెలువడింది. ఇ-కామర్స్ దుకాణాలు, యూట్యూబ్ ఛానెల్‌లు, డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లతో సహా 30 కి పైగా ఆన్‌లైన్ సంస్థలపై చిరంజీవి దాఖలు చేసిన పిటిషన్ ని కోర్టు విచారించింది. ఆయా సంస్థలు చిరంజీవి అనుమతి లేకుండా వాణిజ్య, వ్యక్తిగత లాభం కోసం ఆయన వ్యక్తిత్వాన్ని ఉపయోగించుకుంటున్నాయని ఆరోపించారు. కొన్ని ఉత్పత్తులకు చిరంజీవి స్వయంగా ప్రచారం చేస్తున్నారు అని నమ్మించేంతగా ప్రకటనలు రూపొందించారని ఇలాంటివి వ్యక్తిగతంగా ఆయనకు, ఆయన కుటుంబానికి డ్యామేజ్ చేస్తాయని కూడా న్యాయవిచారణలో పేర్కొన్నారు. చిరు లేదా మెగాస్టార్ చిరంజీవి, బాస్, అన్నయ్య లేదా ఇంకేవైనా బిరుదుల పేర్లను ఉపయోగించి కొన్ని ఉత్పత్తులను సేల్ చేస్తున్నారని, అది ఆయనకు నష్టం కలిగిస్తుందని కూడా అభియోగాలు నమోదయ్యాయి. %సూశ్రీంశీ =ఘుం% - పెళ్లి కబురే లేదంటే పిల్లలు కూడానా? చిరంజీవి అసాధారణ ఛరిష్మాను అనుమతి లేకుండా ఉపయోగించుకోవాలనుకుంటే శిక్ష తప్పదని కోర్టు వ్యాఖ్యానించింది. వాణిజ్య ప్రయోజనాల కోసం.. రాజకీయ, దేశ వ్యతిరేక లేదా అసభ్యకరమైన కంటెంట్‌ను ప్రచారం చేయడానికి చిరంజీవి ఫోటోలు లేదా ఏఐ కంటెంట్‌ను ఉపయోగిస్తే అది నేరపూరితమైన చర్యగా పరిగణించబడుతుంది. ఈ నష్టం పూడ్చలేనిది అని కూడా కోర్టు ఆర్డర్ పేర్కొంది. భౌతిక, ఎలక్ట్రానిక్ మాధ్యమాలు, ఏఐ-ఆధారిత మీడియాలు .. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో ఏదైనా మాధ్యమంలో చిరంజీవి గుర్తింపును ఉపయోగించకుండా కోర్టు నిషేధం విధించింది. ఈ కేసు తదుపరి విచారణ అక్టోబర్ 27న జరగనుంది. చిరంజీవి న్యాయ బృందం అన్ని డిజిటల్ మాధ్యమాల నుంచి వ్యక్తిత్వ హక్కులకు శాశ్వత రక్షణ కోరుతుందని భావిస్తున్నారు.

# స్టార్ హీరో తనయుడు మరోటి లాక్!



చియాన్ విక్రమ్ తనయుడు ధృవ్ బైసన్‌తో భారీ విజయం అందుకున్న సంగతి తెలిసిందే. ధృవ్ కెరీర్‌లో నమోదైన అసలైన సక్సస్ ఇది. దీంతో ధృవ్ సహా కుటుంబమంతా ఎంతో సంతోషంగా ఉంది. ఇదే చిత్రాన్ని తెలుగులోనూ అనువదించి రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా ప్రచారం కోసం ధృవ్ అండ్ కో హైరాబాద్ వచ్చి ప్రచారం చేస్తోన్ సంగతి తెలిసిందే. తమిళ్‌లో సక్సస్ అయిన నేపథ్యంలో తెలుగులోనూ మంచి విజయం సాధిస్తుంది? అన్న నమ్మకంతో టీమ్ ఉంది. ఈ నేపథ్యంలో ధృవ్ తెలుగులో సైతం మాట్లాడే ప్రయత్నం చేసి ఆడియన్స్‌కు రీచ్ అయ్యాడు. ఈ నేపథ్యంలో ధృవ్ తదుపరి చిత్రాలకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నాడు. ఇప్పటికే డాడా ఫేం గణేష్ బాబుతో ఓ సినిమా చేయడానికి ఒప్పందం చేసుకున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇటీవలే గణేష్ స్టోరీ వినిపించడం..నచ్చడంతో ధృవ్ ఒకే చేయడం జరిగిందిట. ఇదే స్టోరీని విక్రమ్ కూడా విని ఒకే చేసారని సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అన్ని పనులు పూర్తి చేసి డిసెంబర్ నుంచి పట్టాలెక్కించాలని ప్లాన్ చేస్తున్నారుట. అలాగే హాయ్ నాన్న ఫేం శౌర్యువ్ కూడా ధృవ్‌కి మంచి స్నేహితుడు అన్న సంగతి తెలిసిందే. ధృవ్ తొలి సినిమా నుంచే శౌర్యువ్‌తో మంచి పరిచయం ఉంది. ఆ సినిమాకు శౌర్యువ్ అసిస్టెంట్‌గా పనిచేసాడు. అతడిలో ట్యాలెంట్‌ను గుర్తించి ధృవ్ అప్పటి నుంచి క్లోజ్‌గా మూవ్ అవ్వడం మొదలు పెట్టాడు. తెలుగు స్పీచ్ కూడా రాసిచ్చింది శౌర్యువ్ నే. అలాంటి క్లోజ్ ఫ్రెండ్‌తో ధృవ్ సినిమా చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. శౌర్యువ్ కూడా వెరీ ట్యాలెంటెడ్. అతడు ఎంతటి ప్రతిభావంతుడు అన్నది హాయ్ నాన్నతో ప్రూవ్ అయింది. నాని హీరోగా నటించిన సినిమా కమర్శియల్ వర్కౌట్ కానప్పటికీ విమర్శకులు మెచ్చిన చిత్రంగా నిలిచింది. మంచి రైటర్‌గా శౌర్యవ్ కి పేరొచ్చింది. శౌర్యువ్ తదుపరి సినిమా కూడా నానితోనే ఉంటుందని వార్తలొస్తున్నాయి. అలాంటి ప్రతిభావంతుడిని ధృవ్ ఎందుకు వదులుకుంటాడు గణేష్ తర్వాత ధృవ్ తదుపరి సినిమా శౌర్యువ్‌తో ఉన్నా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ప్రస్తుతం శౌర్యువ్ టాలీవుడ్ హీరోలకు కథలు వినిపించే పనిలో బిజీగా ఉన్నాడు. అతడితో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కూడా సినిమా చేస్తున్నట్లు వార్తలొస్తున్న సంగతి తెలిసిందే.

# వరదప్పై, తుఫానుతో ముంపుకి గురవుతున్న లోతట్టు ప్రాంతాల్లో పరిశీలన చేసిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



**వెంకటగిరి, (రాజధాని వార్తలు):** తుఫాన్ ప్రభావంతో వెంకటగిరి పట్టణం సహా చుట్టుపక్కల ప్రాంతాల్లో ముంచెత్తిన వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. తుఫానుకు సంబంధించి ఏర్పడిన అకాల వర్షాల వల్ల పలు లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. ఈ నేపథ్యంలో స్థానిక శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ మంగళవారం ఉదయం నుంచి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. పట్టణంలోని మల్లమ్మ గుడి వీధి, కైవల్యా నది ప్రవాహాలను, చింతమాను తదితర ప్రాంతాల్లో ఎంఎల్ఏ స్వయంగా అడుగడుగునా పరిస్థితిని పరిశీలించారు. ప్రజల యొక్క సమస్యలు అడిగి తెలుసుకుంటూ అధికారులకు తగిన సూచనలు చేస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ "వెంకటగిరిలో ఎక్కడా నీరు నిల్వ ఉండాలని ముంపునకు లోనైన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అవసరమైతే రిలీఫ్ క్యాంపులు ఏర్పాటు చేయాలి" అని చెప్పారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం వారి వెంట ఉందని భరోసా ఇచ్చారు. తుఫాన్ పూర్తిగా తేలే వరకు తాము మున్సిపల్ అధికారులతో కలిసి పూర్తి సమీక్ష నిర్వహిస్తూ ఉండనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, ఏఎంసి చైర్మన్, తిరుపతి పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి, రాష్ట్ర, నియోజకవర్గం అనుబంధ కమిటీ సభ్యులు, జనసేన పట్టణ అధ్యక్షులు, సర్కిల్ ఇన్స్పెక్టర్, శ్రీకాళహస్తి టెంపుల్ బోర్డ్ సభ్యులు, సిహెచ్‌సి హాస్పిటల్ సభ్యులు, పిఏసిఎస్ చైర్మన్ బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

## - డక్కిలి ప్రజలకు ఎస్ఐ శివశంకర్ హెచ్చరిక



**డక్కిలి, (రాజధాని వార్తలు):** మండలంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డక్కలి ఎస్ఐ శివశంకర్ సూచిం చారు. వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు వర్షాలు ముమ్మరంగా కురుస్తున్న వేళ ప్రజలు అవసరమైతే తప్ప ఇంటి బయటకు రావొద్దని సూచించారు. ప్రత్యేకంగా రైతులు, విద్యుత్ స్తంభాలు, పరికరాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. రోడ్లపై వేగంగా వెళ్లొద్దు వాహనదారులు రోడ్డుపై అత్యధిక వేగంతో ప్రయాణించకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లోని కల్వర్టుల దగ్గర గుంతల ప్రమాదం ఉండవచ్చని, అక్కడకు వెళ్లొద్దని సూచించారు. ఈతకు వెళ్లవద్దు – ప్రాణాలకు ముప్పు కొంతమంది యువకులు చెరువులు, వాగుల్లోకి ఈత కొట్టేందుకు, చేపలు పట్టేందుకు వెళ్తున్నారని, ఇది ప్రాణాలకు ముప్పుగా మారొచ్చని ఎస్ఐ శివశంకర్ హెచ్చరించారు. చెట్ల కింద ఉండవద్దు – జాగ్రత్త! చెట్ల కింద నిలవడం ప్రమాదకరమని, రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేటప్పుడు మోటార్లను ఆన్ చేసే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సహాయం కోసం పోలీస్ శాఖ సిద్ధం ఏమైనా అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. పోలీస్ శాఖ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, సమస్యలు ఉన్నా వెంటనే స్పందిస్తామని శివశంకర్ తెలిపారు.

# స్మార్ట్ స్ట్రీట్ బజార్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి నారాయణ

## - మహిళా వ్యాపారులతో మాట్లాడిన మంత్రి, ఆయన కుమార్తె షరణి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోని మొట్టమొదటిసారిగా నెల్లూరు మైపాడు గేట్ సెంటర్లో సర్వాంగ సుందరంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ సహకారంతో స్మార్ట్ స్ట్రీట్ బజార్ రూపుదిద్దుకుంది. ఈ క్రమంలో బుధవారం మంత్రి నారాయణ, ఆయన కుమార్తె షరణి స్మార్ట్ స్ట్రీట్ బజార్‌ను ఆకస్మికంగా సందర్శించారు. మహిళా వ్యాపారులతో వారు ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. బాగున్నారా, వ్యాపారాలు ఎలా జరుగుతున్నాయి, ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అంటూ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఓ షాపులో మంత్రి నారాయణ కుమార్తె షరణి ఓ చీరను కొనుగోలు చేశారు. మహిళా వ్యాపారస్తులు అందరితో ఆప్యాయంగా మాట్లాడుతూ వారు ముందుకు కదిలారు. తమ షాపుల వద్దకు వచ్చిన మంత్రికి, ఆయన కుమార్తెకు వ్యాపారస్తులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మర్యాదపూర్వకంగా సీఐ కోటేశ్వరరావుని కలిసిన న్యాయవాది సామాజికవేత్త ఇర్ల వెంకటరమణయ్య





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని చిన్నబజార్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లోని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సీఐ చిట్టెం కోటేశ్వరరావుని పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆత్మీయ పూర్వకంగా కలిసిన న్యాయవాది సామాజికవేత్త ఇర్ల వెంకటరమణయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ నేర నియంత్రణలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు సంతాపం తెలిపారు. అదేవిధంగా నెల్లూరు నగరంలో వన్ టౌన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్న సిఐ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సూచన



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తుఫాన్ కారణంగా జిల్లాలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయని అధికారులతో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సూచించారు. పొదలకూరు మండలంలోని నావూరుపల్లి పెద్దవాగు పొంగి నాలుగు గ్రామాలకు రాకపోకలు స్తంభించడంతో వాగు ఉధృతిని బుధవారం సాయంత్రం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు తగ్గుముఖం పట్టి కాలువలు, వాగుల్లో నీటి ప్రవాహం తగ్గేవరకు రైతులు, ప్రజలు సాహశించి వాటిని దాటే ప్రయత్నం చేయరాదన్నారు. పెన్నా నది పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు ముఖ్యంగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసులు, పొదలకూరు సిఐ ఏ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ మహమ్మద్ హనీఫ్, పొదలకూరు పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# భీమిలి ప్రింట్ మీడియా అసోసియేషన్ లోగో ఆవిష్కరించిన గంటా



**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రింట్ మీడియా పాత్ర కీలకం అని భీమిలి నియోజకవర్గ శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు అన్నారు. ప్రింట్ మీడియా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కిలారి మోహనరావు, సుత్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భీమిలి ప్రింట్ మీడియా అసోసియేషన్ లోగోను గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక కాలంలో టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా, సోషల్ మీడియా ప్రభావం ఎంత ఉన్నా ప్రింట్ మీడియాకు ఎప్పుడూ ప్రాధాన్యత ఉంటుందన్నారు. సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్ళడంలో ప్రింట్ మీడియా ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ సందర్భంగా కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లచ్చుబుగత గణపతి రావు, కోశాధికారి ఆరంగి రోజా, సహాయ కార్యదర్శి ముద్దాడ రాజు, కార్యనిర్వహక కార్యదర్శి రాజేటి బసవ కృష్ణమూర్తి, సభ్యులు ముసునూరి సూర్య శ్రీనివాస్, కె చిరంజీవి రావు, భాగం లక్ష్మి, వి.వినోద్, పి కరుణ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండండి

## - ఏపీ ఈ ఎం సి ఎల్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి పేర్కొన్నారు. తీవ్రమైన వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు, ముఖ్యంగా పిల్లలు మరియు వృద్ధులు భద్రతా కారణాల దృష్ట్యా ఇంటి వద్దనే ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా స్కూల్ మరియు కాలేజీలకు సెలవు ప్రకటించడం జరిగినది. రైతులు తమ పంటలను రక్షించుకునే చర్యలు తీసుకోవాలని, విద్యుత్ లైన్లు మరియు చెట్లు కూలిపోయే ప్రమాదం ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.జిల్లా అధికారులు ఇప్పటికే తగిన ముందస్తు చర్యలు చేపట్టగా, ఎమర్జెన్సీ సర్వీసులు సిద్ధంగా ఉంచారని తెలిపారు. ప్రజల సమస్యలపై అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. సోమశిల డ్యాం మరియు చెరువులు వర్షపు నీటితో నిండి ఉన్నాయని, సోమశిల నుంచి పెన్నా నదికి భారీగా నీరు ఇప్పటికే విడుదల చేసిన నేపథ్యంలో, పెన్నా నది పరివాహ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలందరూ ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ప్రభుత్వం యంత్రాంగం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది,ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రత మాకు అత్యంత ప్రాధాన్యం. ఎవరైనా ఇబ్బందుల్లో ఉన్నా వెంటనే స్థానిక అధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేస్తున్నాను అని తెలిపారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండడండి : ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి

**ఆత్మకూరు, (రాజధాని వార్తలు):** బంగాళాఖాతంలో వాయు గుండం బలపడుతున్న దృష్ట్యా రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాల కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి పలు ప్రాంతాల్లోని లోలెవల్ బ్రిడ్జిలపై నీరు ప్రవహిస్తున్న దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న అధికారుల సూచనలు పాటించాలని అన్నారు. వాతావరణ శాఖ నెల్లూరు జిల్లాకు అరెంజ్ అలరెస్ట్ జారీ చేసిన నేపథ్యంలో బలమైన ఈదురు గాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తా యని, ప్రజలు తమకు ఏమైనా సమస్యలు ఎదురైతే అధి కారులకు తక్షణ సమాచారం ఇవ్వాలన్నారు. నియోజక వర్గంలోని అధికారులందరూ ప్రజలకు ఈ తుఫాను వర్షాలు ముగిసే వరకు అవసరమైన సహాయ సహకారాలు అందిం చాలని, ప్రజలను అప్రమత్తం చేయాలని, అత్యవసర వైద్యం, పునరావాస కేంద్రాలను అందుబాటులో ఉంచి వారికి ఎలాంటి కష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సోమశిల జలాశయానికి వస్తున్న వరద ప్రవాహం క్రమేపి పెరుగుతున్న నేపథ్యంలో జలాశయం నుంచి నీటి విడుదలైన సైతం అధికా రులు పెంచుతున్నారని, పెన్నా పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవనశాఖ, విద్యుత్, పోలిసు శాఖల అధికారులు ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రాణ, ఆస్తినష్టాలు జరగకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

# అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి

## - ఈనెల 23 నుంచి 25 వరకు భారీ నుండి అతి భారీ వర్షాలు - మత్స్యకారులు వేటకు వెళ్లరాదు - 24 గంటలు పని చేసేలా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు - జిల్లా కలెక్టరేట్ కార్యాలయం కంట్రోలు రూం నెంబర్లు : 0861 2331261, 7995576699 : జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తుఫాను కారణంగా జిల్లాలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ నిరంతరం పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల అన్నారు. ఈనెల 23 నుంచి 25 వరకు భారీ నుండి అతి భారీ వర్షాల ప్రభావం అధికంగా ఉండనున్న నేపథ్యంలో అధికారులను, ప్రజలను అప్రమత్తం చేస్తూ..ప్రజలు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై బుధవారం జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాల కారణంగా ప్రాణ నష్టం, పశు నష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించాలని, టామ్ టామ్ లేదా మైకుల ద్వారా ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని ఆర్డీవోలు, తహశీల్దార్లను ఆదేశించారు. అనుకోని అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ముందు జాగ్రత్తగా అనువైన ఆశ్రయ కేంద్రాలను గుర్తించి తరలించాలన్నారు. అన్ని శాఖల అధికారులు ముఖ్యంగా మున్సిపల్, వైద్య, ఆరోగ్యం, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, విపత్తు నిర్వహణ (అగ్నిమాపక) తదితర శాఖల అధికారులు, వారి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అలాగే అధికారులు అందరూ జిల్లా కేంద్రం / వారు పనిచేసే స్థానంలోనే అందుబాటులో ఉండాలన్నారు. వర్షాలు ఆగిపోయే వరకు సెలవులు మంజూరు చేయమన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 24/7 పనిచేసే విధంగా కంట్రోల్ రూమును



ఏర్పాటు చేసి అందులో షిఫ్ట్ సిస్టంలో పనిచేసే విధంగా సిబ్బందిని నియమించామన్నారు. ప్రజల నుండి కంట్రోల్ రూమ్‌కి కాల్స్ వచ్చిన వెంటనే తగు సహాయం అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఎక్కడైన వాటర్ లాగింగ్ ఉంటే వెంటనే ఆ నీటిని క్లియర్ చేయాలన్నారు. నిరంతర విద్యుత్తు సరఫరా ఉండాలన్నారు. చెరువులు, కాల్వలు, ప్రాజెక్టుల వద్ద సిబ్బందిని ఉంచి ఎప్పటికప్పుడు సమాచారాన్ని తనకు తెలియచేయాలన్నారు.

కంట్రోల్ రూమ్ నెంబర్లు:

జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, నెల్లూరు కంట్రోల్ రూమ్ : 0861 2331261, 7995576699, భారీ వర్షాల నేపధ్యంలో జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్లా ప్రజలకు చేసిన సూచనలు : భారీ వర్షాలు కురిసేటప్పుడు అత్యవసరమైతేనే ప్రజలు బయటికి రావాలి. నదులు, వంకలు పరివాహ ప్రాంతాలు, అన్ని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. భారీవర్షాలతో పొంగిపొర్లే వాగులు, కాలువలు, రోడ్లు, కల్వర్టులు, మ్యాన్ హెూల్స్‌కు దూరంగా ఉండాలి. భారీవర్షం పడేప్పుడు బయట ఉన్నట్లయితే ఒరిగిన విద్యుత్ స్థంబాలు, తీగలు, చెట్లు, హెూర్డింగ్స్ క్రింద ఉండరాదు. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశు –గొర్రెల కాపరులు చెట్లు క్రింద, పోల్స్, టవర్స్ క్రింద ఉండరాదు. నదులు, వంకలు పరివాహ ప్రాంతాలు, అన్ని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. భారీ వర్షాల వల్ల చెరువులు, కాలువలకు గండ్లు పడే అవకాశం ఉండొచ్చు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన ఇసుక బ్యాగ్స్ ను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు ఆదేశం. పూరి గుడిసెలు, పాత మిద్దెలు, మట్టితో కట్టిన ఇళ్ళల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే పైన తెలిపిన కంట్రోల్ రూమ్ నంబరుకు ఫోన్ చేయండి.

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు..తడిసిన కరెంట్ స్థంబాలను ముట్టుకోరాదు. తడిసిన చేతులతో స్టార్టర్లు కానీ మోటార్లు కానీ ముట్టుకోరాదు. విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను ముట్టుకోరాదు. విద్యుత్ లైన్‌కు చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి తెలియచేయవలెను. పార్కులలో గాని స్టేడియంలో గాని విద్యుత్ స్తంభాలు ముట్టుకోరాదు. ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోరాదు. బయట పెట్టిన లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలి. కరెంటుకు సంబంధించిన వస్తువులు తడి చేతులతో ముట్టుకోరాదు. చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు రాకుండా చూసుకోవాలి. ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయకూడదు. గాలి, దుమారం, వర్షం వలన తెగిన విద్యుత్ వైర్లను ముట్టుకోరాదు. ఇంట్లో ఉన్న వాటర్ హీటర్ యొక్క స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాతనే నీళ్లు పెట్టిన వస్తువును ముట్టవలెను. ఉరుములు మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయవలెను. వర్షం పడుతున్నప్పుడు టీవీ, ఫ్రిడ్జ్ మరియు కంప్యూటర్‌ల యొక్క స్విచ్‌లను ఆఫ్ చేయవలెను, లేనిచో వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంటుంది. కరెంటు లైన్ క్రింద సెల్ ఫోన్ మాట్లాడ కూడదు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ ఏమైన డ్యామేజ్ అయినచో సంబంధించిన అధికారి JLM, ALM, LM లేదా AE దృష్టికి తీసుకెల్లాలి.

# దారకానిపాడులో హత్యకు గురైన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కుటుంబానికి భరోసా ఇచ్చిన రాష్ట్ర మంత్రి నారాయణ

## - మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు - హత్యకు గురైన కార్యకర్త కుటుంబానికి చెక్కులు అందజేసిన మంత్రి నారాయణ






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** అక్టోబర్ 2 న గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు హత్య చాలా దారుణమైనదని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి వర్యులు పొంగూరు నారాయణ అన్నారు. బుధవారం నెల్లూరులోని రోడ్లు భవనాలు అతిథి గృహములో తిరుమలశెట్టి లక్ష్మీ నాయుడు కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేసే కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుమల శెట్టి లక్ష్మీనాయుడు భార్య సుజాతకు ఐదు లక్షల రూపాయల చెక్కును, కుమార్తెలు లహన్వి శ్రీ, తన్వి శ్రీలకు 5 లక్షల రూపాయలు వంతున, తిరుమలశెట్టి భార్గవ నాయుడుకి మూడు లక్షలు, తిరుమలశెట్టి పవన్ కుమార్‌కు 5 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విషయం తెలిసిన వెంటనే లక్ష్మీ నాయుడు హత్య ఉదంతంపై తక్షణమే స్పందించి హెూం శాఖ మంత్రి అనిత, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, శాసనసభ్యులు శ్రీనివాస రావులతో కమిటీ వేయడం జరిగిందన్నారు. కమిటీ తుది నివేదిక ప్రకారం లక్ష్మీ నాయుడు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునే చర్యలలో నిన్న ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగా నగదుతో పాటు వారి కుటుంబ సభ్యులకు రెండు ఎకరాలు వంతున మొత్తం ఆరు ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందన్నారు. అంతే కాక పిల్లల చదువులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని ఆయన తెలిపారు. హత్యాకాండలో వెన్నుపూసకు దెబ్బ తగిలి ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్న తిరుమల శెట్టి పవన్ కుమార్‌కు ఐదు లక్షల రూపాయలు, నాలుగు ఎకరాల భూమిని ఇవ్వడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా గాయాలతో బాధపడుతున్న తిరుమలశెట్టి భార్గవ నాయుడుకు మూడు లక్షల రూపాయలు చెల్లించడం జరిగిందన్నారు. హత్య కేసుపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటుచేసి వీలైనంత త్వరగా నేరస్తులకు శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. వాస్తవానికి లక్ష్మీ నాయుడు, హరిశ్చంద్రప్రసాదులు స్నేహితులని కొన్ని లావాదేవీలలో వచ్చిన తేడాల వల్ల హత్య చేయడం జరిగిందని తెలిసిందన్నారు. పిల్లలకు చెల్లించిన నగదును బ్యాంకులో డిపాజిట్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ అక్టోబర్ రెండో తారీఖున జరిగిన హత్యా ఘటన ఒక విషాద గాదాని, ఇద్దరు స్నేహితులు మధ్య వ్యక్తిగత సమస్యల నేపథ్యంలో హత్య జరిగిందన్నారు. జరిగిన ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి లక్ష్మీ నాయుడు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునే విధంగా కమిటీ వేయడం జరిగిందని కమిటీ నివేదిక మేరకు నిన్న రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి వారి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బాధితురాలు సుజాత మాట్లాడుతూ ఇది కేవలం వ్యక్తిగత కక్షలతో జరిగిందని రాజకీయ అంశాలు ఏమీ లేవని ఆమె తెలిపారు. హత్య జరిగిన తదుపరి రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించి తగు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నేరస్తులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల, కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ తదితరులు,ఆర్డీవో అనూషా ,టీడీపి ముఖ్యనేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నగర పాలక సంస్థ అధికారుల సేవలు ప్రశంసనీయం : జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్లా



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** గత నాలుగు రోజులుగా భారీ వర్షాలు నెల్లూరు నగరాన్ని అతలాకుతలం చేస్తున్నప్పటికీ నగర పాలక సంస్థ అధికారులు అన్ని ముందస్తు చర్యలు తీసుకుని ఎటువంటి ఇబ్బందులు లేకుండా నగర ప్రజలకు సేవలు అంది స్తున్నారని జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్లా కొనియాడారు. చిన్న వర్షానికే ఇబ్బందులు పడే నగర ప్రజలకు ఉపశమనం కలిగిస్తూ, నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ నందన్ ఆధ్వర్యంలో అధికారులు పగలు, రాత్రి లేకుండా కష్టపడి పని చేశారు. పది డివిజన్లలో సిబ్బంది ని 3 షిఫ్ట్‌లుగా విభజించి మురుగునీరు, పారిశుద్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చర్యలు చేపట్టారు. వర్షపు నీరు నిలిచే ప్రాంతాలైన అభిరామ్ హెూటల్ సెంటర్, వి ఆర్ సి సెంటర్, లీలామహల్ సెంటర్, లక్కీ షాపింగ్ మాల్ సెంటర్, సండే మార్కెట్ తదితర ప్రాంతాల్లో మురుగునీటి కాలువల శాశ్వత నిర్మాణాలను తాత్కాలికంగా తొలగించి డ్రైనేజి సిస్టం ను సరి చేశారు. దాంతో పడిన నీరు పడినట్లుగా కాలువలు ద్వారా వెళ్లాయి. అదేవిధంగా నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్ గేట్, రామలింగాపురం, మాగుంట లే అవుట్ ప్రాంతాల్లోని అండర్ పాస్‌ల వద్ద బయటి ప్రాంతాల నీరు చేరకుండా డైవర్షన్ చర్యలు తీసుకున్నారు. దాంతో నగరంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాల ప్రజలు ఎటువంటి ఆటంకం లేకుండా తమ దైనందిత కార్యకలాపాలు సాగించారు. అదేవిధంగా నగరంలోని ప్రధాన కాలువల్లో సిల్ట్ తీసివేయడంతో వర్షపు నీరు సాఫీగా సాగింది. గతంలో చిన్నపాటి వర్షానికి ఇబ్బందులు పడే ప్రజలు ప్రస్తుత భారీ వర్షాలకు ఎటువంటి ఇబ్బందులు లేకపోవడం తో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ నందన్ సేవలను స్ఫూర్తిగా తీసుకుని అధికారులందరూ విపత్తు సమయంలో చొరవతో పనిచేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# హెల్త్ మినిస్టర్ గారూ జిల్లాలో ఆరోగ్య సేవలు కాస్త మెరుగుపరచండి

## - ఖరీఫ్ సీజన్లో 51 లక్షల టన్నులు ధాన్యం సేకరణ లక్ష్యంగా నాదెండ్ల మనోహర్ అడుగులు : కిషోర్ గునుకుల జనసేన





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జనసేన పార్టీ నెల్లూరు జిల్లా కార్యం గోమతి నగర్ నందు జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, సీనియర్ నాయకులు మల్లికార్జున యాదవ్, శేఖర్ రెడ్డి మరియు ముఖ్య నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించారు.

ఈ ప్రెస్ మీట్ లోని ముఖ్యంశాలు...భారీ వర్షాలకి అత్యవసరమైతే తప్ప ప్రజల ఈ బయటకు రావద్దు....వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి–అధికారులు, కూటమి నాయకులతో పాటు జన సైనికులు ప్రజలకు అందుబాటులో ఉండండి. కందుకూరు లక్ష్మీనాయుడు హత్య కిరాతకమైన చర్య,దాన్ని కులాలకు, పార్టీలకు ఆపాదించడం అంతర్గత కుట్రే....కూటమి ప్రభుత్వం బాధితులకు పూర్తి న్యాయం చేస్తుంది. ఖరీఫ్ సీజన్‌లో 51 లక్షల మెట్రిక్ టన్నులు దాన్యం సేకరణ లక్ష్యంగా నాదెండ్ల మనోహర్ సూచించారు. అన్ని జిల్లాలకు సంబంధించిన అన్నదాతలకు కచ్చితంగా కూటమి ప్రభుత్వం న్యాయం జరుగుతుంది. గౌరవ హెల్త్ మినిస్టర్ సత్య జిల్లాలోని ఆరోగ్య సేవలను మెరుగుపరచాలి, వరదల అనంతరం ప్రజలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యల కనుగునంగా పీహెచ్సీ లో సిబ్బంది మెరుగుపరచాలని విన్నపం. కిషోర్ గునుకుల జనసేన పార్టీ, జిల్లా ప్రధాన కార్యదర్శి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల, సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, నాయకులు,చంద్రశేఖర్ రెడ్డి, శ్రీరామ్, వ్యవసాయ మార్కెట్ ఏఎంసి డైరెక్టర్ సురేష్, నాయకులు జమీర్, కృష్ణారెడ్డి, సుధా మాధవ్, గుర్రం కిషోర్, సుధాకర్, నాగేంద్రబాబు కృష్ణమోహన్ రెడ్డి, మనోజ్, పెనేటి శ్రీకాంత్, హరి, వర్షన్, పవన్, వీర మహిళల శాంతి కల తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call

**9440662699, rajadhanivartalu.com**

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

## - సిపిఎం పార్టీ, రైతు సంఘం డిమాండ్

**అనంతసాగరం, (రాజధాని వార్తలు):** భారీ వర్షాల కారణంగా చేతికి వచ్చిన వరి పంటలు నీటి మునిగిన ముస్తాపురం, పాతాళపల్లి, గోవిందంపల్లి, ఉప్పలపాడు గ్రామాలో ఉండే పొలాలను సిపిఎం పార్టీ మరియు రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించడం జరిగింది. రైతులు నాయకుల ముందర కంటతడి పెట్టుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంకయ్య మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా చేతికి వచ్చిన వరి పంట, వేరు శనగ పంట పూర్తిగా నీట మునిగినాయని ఈ వర్షాల కారణంగా ఎకరాకు 40 వేల రూపాయలు రైతులు నష్టపోయారని అన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులను నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని అన్నారు.సిపిఎం పార్టీ అనంతసాగరం మండల కార్యదర్శి అన్వర్ బాషా మాట్లాడుతూ తడిసిన ధాన్యాని ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని అన్నారు.అనంతసాగరం మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలో కేవలం అధికార పార్టీ వారు చెప్పిన వారికే కొనుగోలు చేస్తున్నట్లు, తమ ధాన్యం కొనాలని రైతు అడిగితే మీరే మిల్లర్లతో మాట్లాడుకోవాలని లేకుంటే దళారులకు అమ్ముకోవాలని



చెబుతున్నారని, కొనుగోలు కేంద్రాలో లోడు ధాన్యం ఎత్తడానికి కమిషన్లు అడుగుతున్నారని తమ వద్ద రైతులు ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు.భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించే వరకు వారికి సిపిఎం పార్టీ మరియు రైతు సంఘం అండగా నిలబడి పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు జక్రయ్య,నాగులూరు వెంకటేష్, రైతు సంఘం అనంతసాగరం మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి మరియు రైతులు పాల్గొన్నారు.

# భీమేశ్వరునికి విశేష పూజలు

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రమైన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వరాలయంలో కార్తీక మాస పవిత్ర పూజలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆకాశ దీపం ఏర్పాటుతో మంగళవారం సాయంత్రం కార్తీక పూజలకు అంకురార్పణ జరగగా ఆలయ కార్యనిర్వా హణాధికారి బళ్ళ నీలకంఠం, ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారు జాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చి ఆలయ పుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారు జామున 4 గంటలకే పిఠాపురం రాజావారి గోత్ర నామాలతో అభిషేక పూజలు ఆలయ వేద పండితులు, అర్చకులు భీమేశ్వర స్వామికి, బాలా త్రిపుర సుందరి అమ్మవారికి పంచామృతాభిషేకలు, అమ్మవారికి కుంకుమార్చానలు చేపట్టారు. భక్తులు ఆలయంలో ద్వజస్తంభం వద్ద, ఆలయ మండపాల్లో, ఆలయంలోని మారేడు వృక్షం వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారి నీలకంఠం, ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే



జగదీశ్ మోహన్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే ఆలయానికి విచేసిన భక్తులకు ప్రత్యేక ప్రసాదాలు, అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజన కార్యక్రమాలు అందజేశారు. ఈ పూజల్లో ఆలయ పండితులు, సిబ్బంది, ఆలయ ధర్మకర్తలు పాల్గొని సేవలనందించారు.

# ట్రంపు సుంకాలకు లొంగిపోయిన మోడీ

## - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ విమర్శ




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎడాపెడా విధిస్తున్న సుంకాలు విషయంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పూర్తిగా లొంగిపోయిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వి రాంభూపాల్ అన్నారు. బుధవారం పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనంలో 'ట్రంప్ సుంకాలు – భారత్‌పై ప్రభావం' అంశంపైన కాకినాడ జిల్లా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రాంభూపాల్ మాట్లాడుతూ భారత్‌పై అమెరికా విధిస్తున్న 50 శాతం సుంకాలు దేశంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. రాష్ట్రంలోని వస్త్ర పరిశ్రమ, రొయ్యలు, ఔషధాలు తదితర రంగాలకు తీవ్ర నష్టాలొస్తాయని ఆయన వివరించారు. ఒక్క రొయ్యల వ్యాపారంలోనే రూ.34 వేల కోట్ల నష్టమన్నారు. సినిమాలపైనా సుంకాల దెబ్బ పడిందని తెలిపారు. భారత్ నుండి వెళ్లి అమెరికాలో చదువుకునే వారిపైనా ఈ ప్రభావం తీవ్రంగా ఉందని, అక్కడున్న భారతీయుల కాళ్లకు, చేతులకు బేడీలు వేసి తిప్పి పంపినా మోడీలో చలనం లేదని ఆయన అన్నారు. దేశానికి నష్టం కలిగించే విధానాలను ప్రవేశపెడుతున్న ట్రంప్‌కు అనుకూలంగా ఉండడం దేశానికి తీవ్ర నష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాద రావు, సిపిఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతి కుమార్, సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, బాలం శ్రీనివాస్, గరగపటి పెంటయ్య, డి సత్యనారాయణ, వీరబాబు, తాడిశెట్టి గంగ, పద్మ, నరసింహామూర్తి, అప్పన్న, డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వాకాడలో ఉచిత పశు వైద్య శిబిరం




**కరప, (రాజధాని వార్తలు):** రాష్ట్రీయ గోకుల మిషన్‌లో భాగంగా జిల్లా పశుసంరక్షణ శాఖ ఆధ్వర్యంలో కరప మండలం వాకాడలో రైతు సేవా కేంద్రం వద్ద ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పశు సంరక్షణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.అంబేద్కర్, డీఎల్‌డిఏ డా.కాంతారావు హాజరయ్యారు. శిబిరంలో 48 గేదెలు, 14 ఆవులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా డా.అంబేద్కర్ మాట్లాడుతూ రైతులందరూ పశువుల భీమా పథకం ద్వారా బీమా చేయించుకోవాలని, దీనికి సంబంధించిన సబ్సిడీ బడ్జెట్ వారం రోజుల్లో విడుదల కానుందని తెలిపారు. పాడి రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డా.కాంతారావు మాట్లాడుతూ లింగ నిర్ధారణ వీర్యం ప్రాముఖ్యతను, దాని ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ సొసైటీ చైర్‌పర్సన్ దూడల నారాయుడు, కామిరెడ్డి సురేష్, ఆకుల శ్రీనివాస్, వేళంగి పశు వైద్యాధికారి పి రామచంద్రరావు, వైద్య అధికారి డా. బి.జి.ఎన్.వి. ప్రసాద్, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan